మీ గళం..మా కళం...

# నమస్తే హైదరాబాద్

NAMASTHE HYDERABAD | తెలుగు దిన పత్రిక | RNI No: APTEL/2012/45237

| రంగారెడ్డి | మంగళవారం | 25-11-2025 | సంపుటి : 14 | సంచిక :169 | పేజీలు :8 | వెల : 3 రూ |
|---|---|---|---|---|---|---|
| RangaReddy | Tuesday | 25-11-2025 | Volume :14 | Issue:169 | Pages:8 | Cost : 3 |


**విలేకరులు కావలెను**

నిత్యనూతనంగా వెలువడుతూ
విశేష ప్రజాధరణ పొందుతున్న
నమస్తే హైదరాబాద్
తెలుగు దిన పత్రికకు
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని
జిల్లా, మండల కేంద్రాలలో
విలేకరులు కావలెను.

సీనియర్‌లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం
Ph: 9912580066




## ధర్మేంద్ర కన్నుమూత.. ప్రధాని మోదీ సంతాపం

**నవంబర్ 24 (నమస్తే హైదరాబాద్) :**నటుడు ధర్మేంద్ర కన్నుమూత పట్ల ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. భారతీయ సినిమా రంగంలో ఒక శకం ముగిసిందని, తన అద్భుత నటనతో అనేక పాత్రలకు వన్నె తెచ్చిన ఇది ఎంతో విచారకరమైన సమయం అని అన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని మోదీ పేర్కొన్నారు. అలాగే ధర్మేంద్ర మరణం భారతీయ సినీ పరిశ్రమకు తీరని లోటు అని వ్యాఖ్యానించారు.

# మన అమ్మాయిలు విశ్వ విజేతలు

## మహిళల కబడ్డీ వరల్డ్ కప్‌ను కైవసం చేసుకున్న భారత్..



**నవంబర్ 24 (నమస్తే హైదరాబాద్) :**భారత మహిళల కబడ్డీ జట్టు ఢాకా వేదికగా జరిగిన మహిళల కబడ్డీ వరల్డ్ కప్ 2025 టైటిల్‌ను కైవసం చేసుకుని చరిత్ర సృష్టించింది. ఫైనల్ మ్యాచ్‌లో పటిష్టమైన చైనా తైపేను 35–28 తేడాతో ఓడించి, భారత్ రెండోసారి విశ్వవిజేతగా నిలిచింది. ఈ టోర్నీలో భారత జట్టు అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. గ్రూప్ దశ పోటీలన్నింటిలోనూ విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకున్న భారత్, అక్కడ ఇరాన్‌ను 33–21 తేడాతో ఓడించి ఫైనల్లోకి అడుగుపెట్టింది. మరోవైపు, చైనా తైపే కూడా గ్రూప్ దశలో అన్‌బీటెన్‌గా ఉండి, సెమీస్‌లో ఆతిథ్య జట్టు బంగ్లాదేశ్‌ను 25%–%18 తేడాతో ఓడించి ఫైనల్‌లో భారత్‌ను ఢీకొంది. ఈ ఘన విజయం సాధించిన భారత మహిళా జట్టును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందించారు.ప్రధానమంత్రి మోదీ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేస్తూ, భారత మహిళల కబడ్డీ జట్టు అద్భుతమైన ధైర్యం, నైపుణ్యం, అంకితభావాన్ని ప్రదర్శించిందని ప్రశంసించారు. "ఈ విజయం అనేక మంది యువతులను కబడ్డీ ఆడటానికి ప్రేరేపిస్తుందని, వారిని పెద్ద కలలు కనడానికి, ఎత్తైన లక్ష్యాలు ఎదుర్కోవడానికి ప్రోత్సహిస్తుందని" ఆయన పేర్కొన్నారు. ఈ టోర్నీలో భారత మహిళలు ఆద్యంతం ఆధిపత్యం చూపించి దేశానికి మాణిక్యాన్ని తెచ్చారని, వారి పోరాట ప్రదర్శన విజయవంతమైందని మోదీ కొనియాడారు.

## నూతన సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణం



**నవంబర్ 24 (నమస్తే హైదరాబాద్) :**సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నేడు ప్రమాణ స్వీకారం చేశారు. సీజేఐ హోదాలో తొలిరోజునే 17 కేసులను విచారించారు. అదే సమయంలో ఒక కొత్త విధానపరమైన నియమాన్ని తీసుకువచ్చారు. ఇకపై అత్యవసరంగా విచారణకు

2లో

# నేడో,రేపో సర్పంచ్ షెడ్యూల్

## పంచాయతీ, వార్డుల రిజర్వేషన్లపై జిల్లాల్లో గెజిట్‌ల జారీ

## నేడు ఎస్ఈసీకి అందజేయనున్న పీఆర్




**హైదరాబాద్, నవంబర్ 24 (నమస్తే హైదరాబాద్) :** రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నగారా మోగించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమవుతోంది. ఈ నెల 26న ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల నిర్వహణను సైతం తొందర్లోనే పూర్తిచేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. గ్రామ పంచాయతీలకు జరగబోయే ఎన్నికలకు సంబంధించి.. ఆయా జిల్లాల్లో సర్పంచ్, వార్డు సభ్యులకు సంబంధించి రిజర్వేషన్ల ప్రక్రియ దాదాపు పూర్తయింది. ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా.. వార్డు సభ్యుల రిజర్వేషన్లను ఎంపీడీవోలు ఖరారు చేయగా, సర్పంచుల రిజర్వేష న్లను ఆర్‌డీవోలు సిద్ధం చేశారు. ఎంపీడీవోలు, ఆర్డీవోలు తమ పరిధిలోని మండలాల వారీగా రూపొందించిన రిజర్వేషన్ల జాబితా కలెక్టర్లకు సమర్పించారు. వారు అందించిన వివరాల ఆధారంగా నిబంధనలను సరిపోల్చుకుని.. జిల్లాల వారీగా (హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలు మినహా) సర్పంచ్, వార్డుసభ్యుల రిజర్వేషన్లకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ ను కలెక్టర్లు ఆదివారం విడుదల చేశారు. గెజిట్ కాపీలను పూర్తి సమాచారంతో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు ఆన్‌లైన్ లో చేరవేశారు. జిల్లాల వారీగా రిజర్వేషన్లకు సంబం ధించిన జాబితా ఇప్పటికే ప్రజా సంబంధాల శాఖకు చేరింది. ఏ జిల్లానుంచైనా రావాల్సిన తుది జాబితా ఉంటే, సోమవారం ఉదయంలోపు సేకరిం చి.. రాష్ట్ర ఎన్నిల సంఘానికి సమర్పించేలా అధికారు లు కసరత్తు చేస్తున్నారు. రిజర్వేషన్ల ఖరారు పూర్తయిన తర్వాతనే ఎన్నికల ప్రక్రియకు మార్గం సుగమం అవుతుంది. రిజర్వేషన్లను సూచిస్తూ.. జిల్లాల్లో విడుదలైన గెజిట్ సమాచారం ఆధారంగానే ఎస్‌ఈసీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉంది.

**ఎన్నికల నిర్వహణకు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు**

రాష్ట్రవ్యాప్తంగా 12,760 సర్పంచు, 1,12,534 వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించి ఎన్నికల నిర్వహణకోసం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. గ్రామ పంచాయతీల వారీగా తుది ఓటరు జాబితాలు సిద్ధం అయ్యాయి. ఓటర్లు ఒక వార్డు నుంచి మరో వార్డుకు మారడం, ఒక కుటుంబంలోని ఓటర్లందరూ ఒకేవార్డులో ఉండేలా మ్యాపింగ్‌లో తప్పులు సరిదిద్దే ప్రక్రియ పూర్తయింది. మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలు అందడంతో అధికారులు ఆయా ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారు. పార్టీ గుర్తుల్లేకుండానే సర్పంచ్, వార్డుసభ్యుల ఎన్నికలు చేపడుతున్నప్పటికీ.. ఆయా గ్రామాల్లో పోటీచేసే అభ్యర్థుల్లో, గెలుపు గుర్రాలపై రాజకీయ పార్టీలు దృష్టిపెట్టాయి. పోటీ చేయాలనుకునే వారు సైతం ఆయా పార్టీల మద్దతు కూడగట్టుకుంటూనే, ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. తమ మద్దతుతో గెలిచే అభ్యర్థు?ల ద్వారా భవిష్యత్ ప్రణాళికలు రూపొందించు కోవాలన్న యోచనలో ఆయా పార్టీలు.. కార్యాచరణ ప్రణాళిక రూపొందించు కుంటున్నాయి.

## కొడంగల్ ప్రజల 70 ఏళ్ల కల నెరవేరబోతుంది:



**కొడంగల్, నవంబర్ 24 (నమస్తే హైదరాబాద్) :** ఆడబిడ్డలు సంతోషంగా ఉంటే.. రాష్ట్రంలో ఆర్థికాభివృద్ధి ఉంటుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం కొడంగల్ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఆడబిడ్డల ఆత్మగౌరవంతో బతికేలా ఉండాలని తమ ప్రభుత్వం మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని వివరించారు. ప్రతి పేద తల్లి కళ్లల్లో ఆనందం చూడాలని సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. రూ. 500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామన్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని గుర్తు చేశారు. అదానీ, అంబానీలతో పోటి పడేలా సోలార్ ప్లాంట్స్ నిర్వహణను మహిళలకు అప్పగించామని వివరించారు. మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించామని వివరించారు. హైటెక్ సిటీ శిల్పారామంలో మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు స్టాల్స్ సైతం ఏర్పాటు చేశామని వివరించారు. ఆడబిడ్డలు తయారు చేసిన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయించేందుకు అమెజాన్‌తో సంప్రదింపులు జరుపుతున్నామని పేర్కొన్నారు. మీ జీవితాల్లో వెలుగులు నింపేందుకు మంచి చదువు అందించడం ఒక్కటే మార్గమని సూచించారు. మీ పిల్లలు

2లో

## ఒక్క పెన్షన్ అయినా కొత్తది వచ్చిందా..?:



రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచినా ఒక్క కొత్త పెన్షన్ కూడా ఇవ్వలేదని ఎంపీ డీకే అరుణ అన్నారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. గ్రామాల్లో అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారానే సాధ్యమని,

2లో

## రేషన్ కార్డు ఉంటే మీ ఇంటికే చీర



2లో

## ప్రజా సమస్యలపై కార్పొరేటర్ల తీరు అభినందనీయం



**హైదరాబాద్, నవంబర్ 24 (నమస్తే హైదరాబాద్) :**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సమయంలో కార్పొరేటర్లు పోరాడిన తీరును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశంసించారు. తెలంగాణ భవన్‌లో జీహెచ్ఎంసీ పరిధిలోని శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, కార్పొరేటర్లతో ఆయన సమావేశమయ్యారు. బల్దియా సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, పార్టీ వెంట ఉన్న ప్రతి కార్పొరేటర్‌కు భవిష్యత్తులో మరిన్ని పదవులు వస్తాయని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్ల పాటు ఎలాంటి అవినీతికి తావులేకుండా పనిచేశారని, కరోనా వంటి తీవ్ర సంక్షోభంలోనూ అద్భుతంగా సేవలందించారని ప్రశంసించారు. ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత కూడా ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాడుతున్నారని తెలిపారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కార్పొరేటర్లు అద్భుతంగా పోరాడారని అభినందించారు. పరిశ్రమలకు కేటాయించిన వాటితో పాటు

2లో

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నేడు ప్రమాణం చేసిన జస్టిస్ సూర్యకాంత్

స్వీకరించాల్సిన కేసులను తప్పనిసరిగా లిఖితపూర్వకంగా సమర్పించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. మరణశిక్ష, వ్యక్తిగత స్వేచ్ఛకు విఘాతం కలిగే అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే మౌఖిక అభ్యర్థనలను అనుమతిస్తామని తెలిపారు.జస్టిస్ సూర్యకాంత్ సుప్రీంకోర్టు 53వ సీజేఐగా ప్రమాణం చేసిన అనంతరం రాష్ట్రపతి భవన్ నుంచి సుప్రీంకోర్టుకు చేరుకున్నారు. న్యాయస్థానం ప్రాంగణంలోని గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు.ఆ తర్వాత ఒకటో నెంబరు కోర్టు రూమ్‌లో జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ అతుల్ ఎస్. చందూర్కర్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనానికి ఆయన నేతృత్వం వహించారు. హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం ఒక ప్రైవేటు సంస్థకు వ్యతిరేకంగా దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పును వెలువరించారు. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం రెండు గంటల్లో దాదాపు 17 కేసులను విచారించింది.

## కొడంగల్ ప్రజల 70 ఏళ్ల కల నెరవేరబోతుంది: సీఎం రేవంత్ రెడ్డి

గొప్పగా చదువుకుంటేనే మీ జీవితాల్లో మార్పు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. అందుకే అక్షయ పాత్ర ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 312 ప్రభుత్వ పాఠశాలల్లో 28 వేల మంది విద్యార్థులకు ఉదయం బ్రేక్ ఫాస్ట్ అందిస్తున్నామని చెప్పారు. ఏ విద్యార్థి ఆకలితో ఇబ్బంది పడకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా మధ్యాహ్న భోజనాన్ని అందించే కార్యక్రమం తీసుకువస్తున్నామన్నారు. బిడ్డల గురించి కన్నతల్లి ఆలోచించినట్లుగా%ో% తమ ప్రభుత్వం ఆలోచించి వారి ఆకలి తీరుస్తోందని తెలిపారు.ఎడ్యుకేషన్, ఇరిగేషన్ రంగాలకు తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కొడంగల్ నియోజకవర్గానికి మెడికల్, వెటర్నరీ, అగ్రి, పారామెడికల్, నర్సింగ్, ఇంజనీరింగ్ కళాశాలలు , ఏటీసీలను, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్, డిగ్రీ కళాశాలలు, సైనిక్ స్కూల్ తీసుకొచ్చామని వివరించారు. విద్య ఒక్కటే తరగని ఆస్తి అని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర నలుమూలల నుంచి గొప్ప చదువుల కోసం కొడంగల్‌కు వెళ్లాలనేలా ఈ అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. 16 నెలల్లో అంతర్జాతీయ స్థాయి ఎడ్యుకేషన్ హబ్‌గా కొడంగల్‌ను మార్చాలని ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కోసం రైతులు స్వచ్ఛందంగా భూములు ఇస్తున్నారని చెప్పారు. మూడేళ్లల్లో ప్రాజెక్టు పూర్తి చేసి కొడంగల్ భూములను కృష్ణా జలాలతో తడుపుతామని విశ్వాసం వ్యక్తం చేశారు . లగచర్ల పారిశ్రామిక వాడను అంతర్జాతీయ పారిశ్రామిక వాడగా తీర్చి దిద్దుతామని స్పష్టం చేశారు. త్వరలోనే కొడంగల్ ప్రజలు రైలు కూతను కూడా వినబోతున్నారన్నారు. కొడంగల్ ప్రజల 70 ఏళ్ల కల నెరవేరబోతుందన్నారు. మరో తొమ్మిది నెలల్లో రైల్వే లైన్ ఏర్పాటు పనులు ప్రారంభంకానున్నాయని తెలిపారు. కొడంగల్ నియోజకవర్గంలో సిమెంట్ పరిశ్రమలు సైతం ఏర్పాటు కాబోతున్నాయని వివరించారు. అభివృద్ధిలో కొడంగల్ నియోజకవర్గాన్ని రాష్ట్రానికి ఒక మోడల్‌గా మారుస్తామని చెప్పారు. సర్పంచ్ ఎన్నికల్లో మంచి వ్యక్తులను ఎన్నుకోండంటూ ప్రజలకు సూచించారు. ఆడబిడ్డలకు ప్రభుత్వం అందిస్తున్న సారె ఇందిరమ్మ చీరలని.. ఇవి ప్రతి ఆడబిడ్డకు చీర చేరేలా చూడాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. పదేళ్లు రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం అధికారంలో ఉంటుందని జోస్యం చెప్పారు. రాజకీయాలకు అతీతంగా కొడంగల్‌ను అభివృద్ధి చేసుకునేందుకు ముందుకు రావాలంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. అభివృద్ధికి అండగా ఉండాలని ఈ సందర్భంగా ఆడబిడ్డలను సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

## ప్రజా సమస్యలపై కార్పొరేటర్ల తీరు అభినందనీయం

హైదరాబాద్‌లో భూముల అమ్మకంపై జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో నిలదీయాలని కార్పొరేటర్లకు దిశానిర్దేశం చేశారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ప్రభుత్వం వైఫల్యంపై నిలదీయాలని సూచించారు.

## ఒక్క పెన్షన్ అయినా కొత్తది వచ్చిందా..?:

ఇందిరమ్మ ఇండ్ల మంజూరిలో కేంద్ర ప్రభుత్వ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద నిధులు అందిస్తున్న విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకే ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడం సరికాదని, గత ప్రభుత్వం ఇష్టానుసారంగా మండలాల ఏర్పాటు చేసిందని, అన్ని మండలాల్లో ఒకే ప్రాతిపదికన జనాభా ఉండేటట్టుగా మండలాల ఏర్పాటు జరగాలని ఆమె తెలిపారు.

## 18 ఏళ్లు నిండిన ప్రతీ మహిళకు,,, రేషన్ కార్డు ఉంటే మీ ఇంటికే చీర

తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేస్తోంది. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ.. ముఖ్యంగా ఆడబిడ్డల ఆర్థిక స్వావలంబనపై దృష్టి సారించింది. ఇందులో భాగంగానే ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించింది. రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డు కలిగి.. 18 ఏళ్లు నిండిన ప్రతీ మహిళకు ఈ చీరలను అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. సిద్దిపేట జిల్లాలోని కోహెడలో జరిగిన ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేయాలనే మహోన్నత లక్ష్యంతో పనిచేస్తోందని స్పష్టం చేశారు. తెల్ల రేషన్ కార్డు కలిగి.. 18 ఏళ్లు నిండిన మహిళలకు ఇందిరా మహిళా శక్తి పేరుతో చీరలను పంపిణీ చేస్తామని.. మహిళా సంఘంలోని మహిలళే ఇంటికి వచ్చి బొట్టు పెట్టి అందజేస్తారన్నారు. ఆడబిడ్డలకు ఏ కష్టం రానివ్వమని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అనేక సంక్షేమ కార్యక్రమాలను వేగంగా ప్రారంభించిందని తెలిపారు.

మహిళా సంఘాలకు మరింత ప్రోత్సాహం అందించేందుకు.. వారికి పది సంవత్సరాల పాటు వడ్డీలేని రుణాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా.. మహిళా సంఘాలు ఆర్థిక వృద్ధిని సాధించేందుకు వీలుగా పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు సహకారం అందిస్తున్నామని వివరించారు. ఈ చీరల పంపిణీ అనేది పథకం మాత్రమే కాదని.. మహిళల పట్ల ప్రభుత్వానికి ఉన్న గౌరవాన్ని, వారికి అందించే 'సారె' (బహుమతి)ని సూచిస్తుందని చెప్పారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి.. ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఇదిలా ఉండగా.. ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు ఉన్న మహిళలందరికీ ఇందిరమ్మ చీరలు అందిస్తామని ప్రకటించినప్పటికీ... క్షేత్ర స్థాయిలో కొన్ని గ్రామాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని చోట్ల అధికారులు మహిళా సంఘంలో సభ్యత్వం ఉన్న వారికే ప్రాధాన్యత ఇస్తుండటం, రేషన్ కార్డు ఉన్నప్పటికీ సంఘంలో లేని అర్హులైన మహిళలకు చీరలు అందకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు మాత్రం.. రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ చీరలు పంపిణీ చేయాలని స్పష్టం చేస్తున్నప్పటికీ.. పంపిణీ ప్రక్రియలో లోపాల వల్ల కొంతమంది అర్హులకు అన్యాయం జరుగుతోందని ఆయా గ్రామాల మహిళలు తమ నిరాశను వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి.. క్షేత్ర స్థాయిలో పంపిణీ ప్రక్రియను మరింత పారదర్శకంగా.. సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని మహిళా లోకం కోరుతోంది.

## గొల్లపల్లి పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్ నోట్ బుక్స్ అందజేసిన మాజీ ఎంపీటీసీ జాకీర్





**దేవరుప్పుల( నమస్తే హైదరాబాద్):**దేవరుప్పుల మండలంలోని ఎంపీయుపిఎస్ గొల్లపల్లిలో పాఠశాల విద్యార్థులకు సోమవారం మాజీ ఎంపీటీసీ మహమ్మద్ జాకీర్ టీషర్ట్స్, పాయింట్ యూనిఫామ్ పరీక్ష పాడ్స్, నోట్ బుక్స్ మరియు ఇతర మెటీరియల్ను విరాళంగా అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కామారెడ్డి గూడెం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజేందర్ రావడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కామరెడ్డి గూడెం జాకీర్ ఇలా ప్రభుత్వ పాఠశాలకు అవసరమైన సహాయాన్ని అందిస్తూ వెన్ను దన్నుగా నిలవడం చాలా సంతోషకరమని ఇలాంటి మరెన్నో కార్యక్రమాలు చేయాలని చెప్పడం జరిగింది. ఎంపీయుపిఎస్ గొల్లపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు మాట్లాడుతూ,అడిగిన వెంటనే స్పందించి చేయూతనిచ్చిన జాకీర్ కి కృతజ్ఞతలు తెలియచేయడం జరిగింది. దాత అయిన మహమ్మద్ జాకీర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు పోటీగా నిలుస్తూ అన్నిట్లో ముందుంటున్నారని తెలియచేయడం జరిగింది. భవిష్యత్తులో ఇంకా ఏదైనా అవసరమైన కూడా తాను సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలపడం జరిగింది . ఈ కార్యక్రమంలో, పాఠశాల ఉపాధ్యాయులు ఖాజా, నసీరుద్దీన్ , కృష్ణ, గ్రామస్తులు తీగల సత్యనారాయణ, వెంకన్న, కృష్ణ, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

## మంచి నీటి పైప్ లైన్ నిర్మాణ పనులకు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ శంకుస్థాపన



**నమస్తే హైదరాబాద్,శేరిలింగంపల్లి** : మియాపూర్ డివిజన్ అభివృద్ధిలో భాగంగా రూ.22 లక్షల 50 వేల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే మంచి నీటి పైప్ లైన్ నిర్మాణ పనులకు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. మంచి నీటి సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నాం అని, పలు కాలనీ లలో ప్రజల నుండి వచ్చిన వినతి మెరకు, మా దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకొని ప్రత్యేక చొరవతో ఈ రోజు ముజాఫర్ అహ్మద్ నగర్, శ్రీరంగాపురం కాలనీలలో శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, అత్యవసరం ఉన్న చోట, నిత్యం మంచి నీటి కొరత ఉన్న ప్రాంతలలో ప్రథమ ప్రాధాన్యత గా పనులు పూర్తి చేస్తామని, ఏ చిన్న సమస్య అయిన నా దృష్టికి వచ్చిన తప్పకుండా పరిష్కరిస్తామని,కాలనీ లలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ ,కాలనీలను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళుతు సమస్య రహిత ఆదర్శవంతమైన కాలనీ లు గా తీర్చిదిద్దడమే నా ప్రథమ లక్ష్యం అని, అదేవిధంగా ప్రతి కాలనీ లో స్వచ్ఛమైన మంచి నీటి పైప్ లైన్ నిర్మాణం చేపట్టడం ద్వారా కాలనీ వాసులకు ప్రజలకు, స్వచ్చైమన మంచి నీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని కార్పొరేటర్ శ్రీకాంత్ గారు తెలిపారు.ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు మేనేజర్ సునీత, నాయకులు కార్యకర్తలు, కాలనీల అసోసియేషన్ సభ్యులు,కాలనీ వాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లి నియోజకవర్గం కు రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు

**నమస్తే హైదరాబాద్,శేరిలింగంపల్లి** : శేరిలింగంపల్లి నియోజకవర్గానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్ల వ్యయంతో ఆధునిక సదుపాయాలతో కూడిన ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను మంజూరు చేసిన నేపథ్యంలో, పాఠశాల నిర్మాణం కోసం అవసరమైన స్థల కేటాయింపుపై ఎమ్మెల్యే గాంధీ కీలక చర్యలు చేపట్టారు.సోమవారం అమీర్‌పేట్‌లోని హెచ్ఎండిఏ కార్యాలయంలో హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ ను ఎమ్మెల్యే గాంధీ మర్యాదపూర్వకంగా కలిసి కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో, పేద మధ్యతరగతి విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రాజెక్టు రూపొందించబడింది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గానికి అవకాశం లభించడం ఎంతో గర్వకారణం. అడగగానే రూ.200 కోట్ల బడ్జెట్‌ను కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తన తరఫున, నియోజకవర్గ ప్రజల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.నియోజకవర్గంలో ఆధునిక సదుపాయాలతో, అన్ని హంగులతో కూడిన ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం హెచ్ఎండీఏ పరిధిలో సరిపడా స్థలం అత్యవసరమని, ఆ దిశగా వెంటనే చర్యలు తీసుకోవాలని కమిషనర్ గారిని కోరినట్టు తెలిపారు. దీనికి ప్రతిస్పందించిన కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ సానుకూలంగా స్పందించడం హర్షణీయమని పేర్కొన్నారు.శేరిలింగంపల్లి విద్యారంగ అభివృద్ధిలో ఇది ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని, ఇకపై మా



నియోజకవర్గం విద్యార్థులు మెట్రో స్థాయి వసతులతో కూడిన పాఠశాలలో చదివే అవకాశాన్ని పొందబోతున్నారని ఎమ్మెల్యే గాంధీ అన్నారు.ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరుకు కీలకంగా వ్యవహరించిన సీఎం రేవంత్ రెడ్డి కి, రాష్ట్ర ప్రభుత్వానికి నియోజకవర్గ ప్రజల తరఫున ఎమ్మెల్యే గాంధీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ పాఠశాల ద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులు సైతం నాణ్యమైన, అంతర్జాతీయ ప్రమాణాల విద్యను పొందుతారని, ఇది భవిష్యత్తు తరాల విద్యాభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తుందన్నారు.

## సీఎంఆర్ఎఫ్ పేద, మధ్య తరగతి ప్రజలకు వరం:మందుముల పరమేశ్వర్‌రెడ్డి





**ఉప్పల్, నవంబర్ 24 ( నమస్తే హైదరాబాద్):** సీఎంఆర్ఎఫ్ పేద, మధ్య తరగతి ప్రజలకు వరంగా మారిందని ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి అర్హులందరికీ కూడా సీఎంఆర్ఎఫ్ కింద మెడికల్ బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నట్టుగా తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గం చెందిన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం పరమేశ్వర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగదీశ్వరయ్య రూ.60 వేలు,మహేశ్వరరావు రూ.60 వేలు,కృష్ణ రూ.60 వేలు, రాజేష్. రూ.21 వేలు,గిరి రాధా రూ.60 వేలు,చొప్పున మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పరమేశ్వర్‌రెడ్డి లబ్ధిదారులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు చెన్ రెడ్డి రఘుపతి రెడ్డి , లింగంపల్లి రామకృష్ణ,ఆగం రెడ్డి , కొంపల్లి బాలరాజ్, జే విజయ్ కుమార్, కంది శ్రావణ్ రెడ్డి,విట్టల్ నాయక్, శ్రీహరి,బాబూరావు,నామ్ రాజిరెడ్డి, రాజన్న, అమర్, మహేందర్ ముదిరాజ్,సురేష్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

## వజ్రేష్ యాదవ్ ని కలిసిన ఘట్కేసర్ మున్సిపల్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి



**ఘట్కేసర్ నవంబర్ 24 (నమస్తే హైదరాబాద్)**మేడ్చల్ జిల్లా, ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని ఘట్కేసర్ మున్సిపల్ ప్రజలు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన తోటకూర వజ్రేష్ యాదవ్ ని కలసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. వారు మాట్లాడుతూ వజ్రేష్ యాదవ్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత అభివృద్ధి చెందాలని, ప్రజా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికి చేరాలని తెలిపారు. ఈ కార్యక్రమం యూత్ కాంగ్రెస్ ఘట్కేసర్ మున్సిపల్ అధ్యక్షులు బొక్క సంజీవ రెడ్డి, పోచారం అధ్యక్షులు యుగేందర్ రెడ్డి, మేడిపల్లీ అధ్యక్షులు అజయ్, బోడుప్పల్ అధ్యక్షులు శ్రీకాంత్, సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ భగాయత్ లో వైన్ షాపు ఏర్పాటుకు అనుమతి ఇవ్వద్దు బిజెపి డిమాండ్



**ఉప్పల్, నవంబర్ 24 ( నమస్తే హైదరాబాద్):** ఉప్పల్ భగవత్ లో వైన్ షాప్ పెట్టడానికి అనుమతి ఇవ్వరాదని ఉప్పల్ సర్కిల్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఓంకార్ కి బిజెపి నేతలు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బిజెపి నేతలు మాట్లాడుతూ ఉప్పల్ భగాయ త్ వైన్ షాపు ఏర్పాటుకు అనుమతి ఇవ్వద్దని వారు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఎక్కడైతే వైన్ షాపు ఏర్పాటు చేయాలని ఉన్న ప్రాంతంలోనే వైన్ షాప్ ఏర్పాటు చేయాలని వారు ఉప్పల్ ఎక్సైజ్‌సిఐ ని కోరారు. లేదంటే పెద్ద ఎత్తున బిజెపి ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు మహంకాళి లక్ష్మణ్ ముదిరాజ్ రావుల బాలకృష్ణ గౌడ్, రెడ్డి గారు దేవేందర్ రెడ్డి, వర్కల రాజేందర్ గౌడ్, ఈదులకంటి నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వజ్రేష్ యాదవ్ ని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపిన పట్నం మహేందర్ రెడ్డి ,ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు



**ఉప్పల్, నవంబర్ 24 ( నమస్తే హైదరాబాద్):** నూతనంగా మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఎన్నికైన తోటకూర వజ్రేష్ యాదవ్ ను సోమవారం మాజీ మంత్రి, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి ,ఉప్పల్ ,చెర్లపల్లి,కాప్రా కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి ,రజిత పరమేశ్వర్ రెడ్డి ,స్వర్ణరాజ్ శివమణి లు వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు . ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ కి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## అస్వస్థతకు గురైన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



**నమస్తే హైదరాబాద్ :** వైసీపీ కీలక నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అస్వస్థతకు గురయ్యారు. హుటాహుటిన ఆయనను వైద్య పరీక్షల కోసం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గతకొంతకాలంగా వెరికోస్ వెయిన్స్‌తో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే చెవిరెడ్డి అస్వస్థతకు గురైనట్లు సమాచారం. ఆస్పత్రిలో ఆయనకు వైద్యం అందిస్తున్నారు. అనంతరం డాక్టర్లు మీడియాకు చెవిరెడ్డి ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు వెల్లడించే అవకాశాలు ఉన్నాయి.

# ఉప్పల్ బాగాయత్ మద్యం షాపు ఏర్పాటును నిరసిస్తూ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన ధర్నా

*– నిరసన ధర్నాకు మద్దతు నిచ్చిన బిజెపి నేతలు, అఖిలపక్ష నాయకులు*






**ఉప్పల్, నవంబర్ 24 ( నమస్తే హైదరాబాద్):** ఉప్పల్ భగాయత్ హెచ్ఎండిఎ లేఔట్ లో కొత్తగా ఏర్పాటు చేయనున్న మద్యం దుకాణానికి వ్యతిరేకంగా ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మేకల మధుసూదన్ రెడ్డి, కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ధర్నా కార్యక్రమానికి ముఖ్య మద్దతు దారులుగా ఉప్పల్ మాజీ శాసనసభ్యులు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ , బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు మేకల శిల్పా రెడ్డి , ఉప్పల్ మాజీ చైర్మన్,పూర్వపు రైతు సంఘం నాయకులు మేకల శివారెడ్డి , సల్ల రాజి రెడ్డి , ఐ ఫోకస్ ముఖ్యగురువులు వాసుదేవ శర్మ , అఖిలపక్షం నాయకులు,వివిధ పార్టీల నాయకులు, అధిక సంఖ్యలో మహిళలు, కాలనీలోని కుటుంబసభ్యులు, పాల్గొని భగాయత్ వాసులు చేస్తున్న పోరాటానికి అండగా మద్యం దుకాణానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి తీవ్ర నిరసన వ్యక్తం చేయటం జరిగింది. ఈ సందర్భంగా ధర్నాలో పాల్గొన్న ప్రతినిధులు మాట్లాడుతూ ఉప్పల్ బాగయత్ మద్యం షాపు ఏర్పాటును విరమించుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మద్యం షాపు ఏర్పాటుకు ఎక్కడైతే ప్రభుత్వం అనుమతి ఇచ్చిందో అదే ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. బాగాయ త్ లో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే కలిగే అనర్ధాలను వారు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేకుండా పోయిందని వారు పేర్కొన్నారు.

## మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ డిసిసి అధ్యక్షుడిని కలిసిన హజ్ కమిటీ సభ్యులు





**మేడిపల్లి (నమస్తే హైదరాబాద్):** మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడిగా తోటకూర వజ్రెష్ యాదవ్ ఎంపికైన సందర్భంగా వారి నివాసంలో హజ్ కమిటీ సభ్యులు ముజీబ్, మజార్, మహ్మద్ యాకుబ్, ఖాదర్, యూసఫ్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు అందజేశారు. మేడ్చల్ జిల్లాలో సామాజిక సేవతో పాటు, కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో కొత్త అధ్యాయం ఆరంభమైన రోజుగా పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు.

## శ్రీ వెంకటేశ్వర డయాగ్నస్టిక్స్ సెంటర్ ప్రారంభోత్సవానికి హాజరైన తుంగతుర్తి రవి





**బోడుప్పల్ (నమస్తే హైదరాబాద్) :**బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగిచర్ల క్రాంతి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ వెంకటేశ్వర డయాగ్నస్టిక్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి యాజమాన్య సభ్యులు రాజ్‌కుమార్ , వెంకటేష్ ఆహ్వానం మేరకు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి హాజరై యాజమాన్యానికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుంగతుర్తి రవి గారు,పరిసర ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అత్యంత అవసరం. ఈ దయాగ్నస్టిక్ సెంటర్ ద్వారా సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండేలా, చౌక ధరల్లో, నమ్మకమైన వైద్య పరీక్షలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్ కుమార్, వెంకటేష్,రవి, సందీప్, శ్రీకాంత్ మరియు స్థానిక ప్రజలు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపట్టపుపాలెంలో రైతన్న మీకోసం కార్యక్రమం!

## ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



**నమస్తే హైదరాబాద్ :** రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందులలో ఉన్నప్పటికీ, రైతు సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. మండలం లోని పెద్దపట్టపుపాలెం గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమనకి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతుల ఇళ్లకు వెళ్లి, ఈ ఏడాదిన్నరకాలంలో రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం అమలు చేసిన పథకాలను కరపత్రాల రూపంలో వివరించారు. గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారం ఇప్పటికే రెండు విడతలుగా, అన్నదాత సుఖీభవ పథకం నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. రైతు రథం పథకం ద్వారా ట్రాక్టర్లు పంపిణీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. గత వైసిపి ప్రభుత్వంలో రైతు భరోసా క్రింద రూ.20 వేలు ఇస్తామని చెప్పి రెండుమూడు విడతల్లో కేవలం రూ 13,500 మాత్రమే ఇచ్చారని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి రైతులను పూర్తిగా గాలికి వదిలేయడంతో, వ్యవసాయరంగం సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. అలాగే వేట విరామ సమయంలో మత్స్యకారులకు వైసిపి ప్రభుత్వం 10 వేలు మాత్రమే ఇవ్వగా, చంద్రబాబు నాయుడు మత్స్యకార సేవ పేరుతో, ఆ మొత్తాన్ని రెట్టింపు చేశారని తెలిపారు. అలాగే మత్స్యకారులకు అన్యాయం చేసేలా జగన్ ప్రభుత్వం తీసుకువచ్చిన 217 జీవోను రద్దు చేశామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రైతులను ఇబ్బంది పెట్టిన విషయాన్ని ఎవరూ మర్చిపోలేరని అన్నారు. తమ ప్రభుత్వంలో ఎక్కువగా మేలు జరుగుతున్న విషయాన్ని రైతులే స్వయంగా చెబుతుంటే ఆనందంగా ఉందని చెప్పారు. నియోజకవర్గంలో కుంటలు చెరువుల పటిష్టత, పంట కాలువల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు రైతుల కోసం ప్రవేశపెడుతున్న పథకాలు, సబ్సిడీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాలలోసమస్యలను తన దృష్టికి గాని, అధికారుల దృష్టికి అని తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు.

జనార్ధన్, తూపిలి సిద్దు కాపులు పెద్దలు రైతులు కూటమి నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్.. ఏకంగా రూ.8.7 కోట్లతో..



**నమస్తే హైదరాబాద్ :** ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. గత పర్యటనలో ఏలూరు జిల్లా, ఐ.ఎస్. జగన్నాథపురం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దర్శనానికి వచ్చిన సందర్భంలో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని, ఆలయ ప్రదక్షిణ మండప నిర్మాణంతోపాటు గ్రామం నుంచి కొండ పైకి వెళ్లేందుకు రోడ్డు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఆలయ అభివృద్ధి అంశాన్ని మంత్రివర్గం దృష్టికి తీసుకువెళ్లారు. ఆలయ అభివృద్ధికి ప్రత్యేక నిధుల కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కోరారు. ఇందుకు అనుగుణంగా ఆలయ అభివృద్ధికి రూ. 8.7 కోట్ల నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారు. ఆలయానికి అనుబంధంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు 30 ఎకరాల భూమిని ప్రభుత్వం నుంచి ఇప్పించారు.

సోమవారం ఐ.ఎస్.జగన్నాథపురం పర్యటనలో భాగంగా పవన్ కళ్యాణ్ .. జిల్లా ఇంఛార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ తో కలసి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం రూ. 3.5 కోట్ల దేవాదాయ శాఖ నిధులతో ఆలయ ప్రాంగణంలో నిర్మించనున్న ప్రదక్షిణ మండపానికి, రూ. 3.7 కోట్ల పంచాయతీరాజ్ రోడ్ అసెట్స్ నిధులతో ఐ.ఎస్. జగన్నాథపురం గ్రామం నుంచి ఆలయానికి వెళ్లేందుకు నూతన రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసి, శిలాఫలకాలు ఆవిష్కరించారు. దీంతో పాటు ఇప్పటికే ఆర్ అండ్ బి శాఖ సహాయంతో పొంగుటూరు, లక్కవరం మధ్య గోతుల మయంగా ఉన్న రహదారికి రూ.1.5 కోట్లతో మరమ్మతులు చేయించారు. ఏలూరు జిల్లా పర్యటనలో భాగంగా ఈ రహదారిని పరిశీలించారు.

30 ఎకరాల భూమి పత్రాలు ఆలయ అధికారులకు అందజేత..

శతాబ్దాల చరిత్ర కలిగిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పవన్ కళ్యాణ్ గత పర్యటన సందర్భంగా ఆలయ పరిసరాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి భూమి ఇప్పిస్తానని మాటిచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం 30 ఎకరాల భూ కేటాయింపుకి సంబంధించిన పత్రాలు సోమవారం పవన్ కళ్యాణ్ గారు ఆలయ అధికారులకు అందజేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న పవన్ కళ్యాణ్ కు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు హర్షధ్వానాలతో ధన్యవాదాలు తెలియజేశారు.

పూల వర్షం.. కూలీలతో పవన్ కళ్యాణ్ ముచ్చట్లు.. అంతకుముందు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేందుకు ఐ.ఎస్. జగన్నాథపురం వచ్చిన పవన్ కళ్యాణ్ కు ప్రజలు దారి పొడవునా పూల వర్షంతో స్వాగతం పలికారు. రాజవరం, యర్రంపేట, గవరవరం, ఐ.ఎస్. జగన్నాథపురం గ్రామాల్లో ఆడపడుచులు పవన్ కళ్యాణ్ కు హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను తెలియచేసేందుకు ముందుకు రాగా వారి వద్దకు వెళ్ళి వినతి పత్రాలు స్వీకరించి, వివరాలు తెలుసుకున్నారు. తిరుగు ప్రయాణంలో పొలాల్లో పని చేసుకుంటున్న కూలీలను ఆప్యాయంగా పలకరించి, వారితో ఫొటోలు దిగారు.

# ఎన్నికల ముందు నాటి పాత వ్యూహాలనే జగన్ అనుసరిస్తున్నారంటూ విమర్శలు

**నమస్తే హైదరాబాద్ :** టీడీపీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వైసీపీ అధినేత జగన్ పై తీవ్ర విమర్శలు చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి చవిచూసినా జగన్ తన తీరు మార్చుకోలేదని, ఇప్పటికీ కాలం చెల్లిన రాజకీయ వ్యూహాలతోనే ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు."2024 ఎన్నికల ముందు కూడా 'సిద్ధం సిద్ధం' అని జగన్ ఇలాగే ఫోటోలు, వీడియోలు పెట్టి ఒకటే హడావుడి చేశాడు. లక్షల మంది జనం అన్నాడు వై నాట్ 175 అన్నాడు జరిగింది ఏంటో జనమంతా చూశారు. ఏపీ ప్రజలు సాధారణ ఎన్నికల్లో పూర్తి ఆలోచనతో, అప్రమత్తతో, అవగాహనతో, చైతన్యంతో వ్యవహరించి ఓట్లేశారు.అయినా జగన్ మారలేదు. ఇంకా భ్రమల్లో ఉండి అవుట్ డేటెడ్ పాలిటిక్సే చేస్తున్నాడు. ఎన్నికల ముందు వాడి పడేసిన పాత ఎత్తుగడలు అమలు చేసి ప్రజలను మళ్లీ మోసం చేయాలని చూస్తున్నాడు. కోర్టుకు, పెళ్లికి, చావుకు వెళితే కూడా జనం వచ్చారని చెప్పుకుంటూ తనపై ప్రజా వ్యతిరేకత తగ్గిందని డబ్బా కొట్టుకునేందుకు కిందా మీదా పడుతున్నాడు. ఇవన్నీ ఇప్పటికే వాడేసిన అవుట్ డేటెడ్ స్ట్రాటజీస్ అని జనం గుర్తించారు. ఇప్పుడు జగన్ గుర్తించాలి.సో నేను చెప్పొచ్చేది ఏంటంటే సొంత మీడియా ఎలివేషన్లు, డ్రోన్ కెమేరా ట్రిక్కులు, సోషల్ మీడియా విజువల్ ఎఫెక్ట్ లు ఇకనైనా



వదిలేసి కాస్త నిజాయతీగా ఉండడానికి ప్రయత్నిస్తే బెటర్అంటూ సోమిరెడ్డి హితవు పలికాడు.

# జూన్‌లోగా స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు..ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం



**నమస్తే హైదరాబాద్ :** పాలనలో సాంకేతికతకు పెద్దపీట వేస్తోంది ఏపీ ప్రభుత్వం. అధునాతన సాంకేతికతను ఉపయోగించి పౌర సేవలను ప్రజలకు మరింత సులభతరం చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్, స్మార్ట్ రేషన్ కార్డులు వంటివి తీసుకువచ్చింది. వీటి ద్వారా పౌరసేవలను సులభంగా, వేగంగా అందించడంతో పాటుగా పారదర్శకంగా సేవలు అందించవచ్చని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలోనే సీఎం నారా చంద్రబాబు నాయుడు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. 2026 జూన్ లోపు రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు అందజేయాలని నిర్ణయించారు. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ మీద సీఎం చంద్రబాబు నాయుడు సచివాలయంలో సోమవారం రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జూన్‌లోగా రాష్ట్రంలో స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు.. అంటే ఏమిటి? మరోవైపు ఏపీలోని ప్రతీ కుటుంబాన్ని ఒక యూనిట్ కింద తీసుకుని.. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న పౌర సేవలు, సంక్షేమ కార్యక్రమాల వివరాలతోపాటుగా ప్రభుత్వ శాఖల వద్ద ఉన్న సమాచారాన్ని క్రోడీకరించి ఈ ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అమలు చేస్తారు. ఈ విధానంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని కోటీ 40 లక్షల కుటుంబాలకు స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు అందిస్తారు. ఈ కార్డుల మీద క్యూఆర్ కోడ్ ముద్రించి ఉంటుంది. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన వెంటనే ఆ కుటుంబానికి సంబంధించిన సమాచారం, సంక్షేమ పథకాల వివరాలు, పీ4 అంశాలు వంటివి తెలిసేలా వీటిని డిజైన్ చేయనున్నారు.స్మార్ట్ ఫ్యామిలీ కార్డులను ఉపయోగించి కుల ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డు సేవలు, పింఛన్లు, స్కాలర్‌షిప్స్, వ్యాక్సినేషన్ వివరాలు. ఆధార్ కార్డుల వివరాలు వంటివి ట్రాక్ చేసేలా దీనిని రూపొందించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ప్రజలకు సంబంధించిన అన్ని వివరాలూ నమోదు చేసేలా ఈ స్మార్ట్ ఫ్యామిలీ కార్డు ఉండాలని సూచించారు.స్మార్ట్ ఫ్యామిలీ కార్డులలో ఆయా కుటుంబాలకు చెందిన మొత్తం వివరాలు నమోదు చేస్తారు. దీంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందించవచ్చని ప్రభుత్వం ఆలోచన. అలాగే పౌరసేవలను సులభంగా అందించవచ్చనేది మరో ఉద్దేశం. స్వర్ణాంధ్ర విజన్ యూనిట్ల ద్వారా కుటుంబాల వివరాలను ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, స్మార్ట్ ఫ్యామిలీ కార్డులలో అప్ డేట్ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు.

# దేశంలోనే తొలి పాడ్ ట్యాక్సీ నెట్‌వర్క్.. డ్రైవర్ లేకుండానే పరుగులు

**నమస్తే హైదరాబాద్):** ప్రస్తుతం రవాణా వ్యవస్థలో భారత్.. ప్రపంచంలోని అగ్రదేశాల సరసన చేరుతోంది. వందే భారత్ రైళ్లు, మెట్రో రైళ్లు, బుల్లెట్ రైళ్ల తర్వాత ఇప్పుడు దేశీయ పట్టణ రవాణా వ్యవస్థ ఒక నూతన శకంలోకి అడుగుపెడుతోంది. మన దేశంలోనే మొట్టమొదటి పాడ్ ట్యాక్సీ నెట్‌వర్క్‌ను ప్రారంభించడానికి మహారాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ విప్లవాత్మకమైన.. డ్రైవర్‌లెస్ రవాణా వ్యవస్థ థానే, నవీ ముంబై, మీరా-భయందర్ ప్రాంతాల మధ్య రోజువారీ ప్రయాణాన్ని పూర్తిగా మార్చేయనుంది.

మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో దేశంలోనే మొట్టమొదటి పాడ్ ట్యాక్సీ నెట్‌వర్క్‌కు ఆమోదం లభించింది. ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎంఎంఆర్‌డీఏ) పర్యవేక్షణలో ఈ పాడ్ ట్యాక్సీ ప్రాజెక్ట్.. పీపీపీ (పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్) మోడల్‌లో అమలు కానుంది. ఈ పీపీపీ పద్ధతి ద్వారా ప్రైవేట్ కంపెనీలు తమ టెక్నికల్ స్కిల్స్, ఆర్థిక సహాయాన్ని అందించనున్నాయి. మరోవైపు.. ఈ పాడ్ ట్యాక్సీ ప్రాజెక్టుకు సంబంధించిన సాధ్యాసాధ్యాల అధ్యయనాలు ఇప్పటికే పూర్తి అయ్యాయి. పాడ్ ట్యాక్సీలు అనేవి పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ మోడల్‌పై ఆధారపడి పనిచేస్తాయి. ఇవి డ్రైవర్ లేకుండానే.. విద్యుత్‌తో నడిచే చిన్నపాటి క్యాబిన్‌లు (పాడ్స్). ఇవి భూమికి ఎత్తులో నిర్మించిన ట్రాక్‌లపై ప్రయాణం చేస్తాయి. ప్రస్తుతం ఈ పాడ్ ట్యాక్సీల వ్యవస్థ అబుదాబి, లండన్, దక్షిణ కొరియా, జపాన్‌లలోని కొన్ని ప్రాంతాల్లో సక్సెస్‌ఫుల్‌గా అక్కడి ప్రయాణికులకు సేవలు అందిస్తున్నాయి. ఇక మన దేశంలో ఉన్న అధిక జనసాంద్రత గల ప్రయాణ నమూనాలకు అనుగుణంగా ఈ పాడ్ ట్యాక్సీ మోడల్‌లో మార్పులు చేయనున్నారు. ఈ పాడ్ ట్యాక్సీ నెట్‌వర్క్ రోజువారీ ప్రయాణికులకు గరిష్ట ప్రయోజనం చేకూర్చేలా.. ట్రాఫిక్ ఇబ్బందులను



తగ్గించేందుకు వీలుగా ఏ ఏ మార్గాలను కలుపుతూ నిర్మించాలి అనేది గుర్తించడానికి స్థానిక మున్సిపల్ సంస్థలతో కలిసి ఎంఎంఆర్‌డీఏ పనిచేయనుంది ఈ పాడ్ ట్యాక్సీ ప్రాజెక్ట్ నిర్మాణం, నిర్వహణ బాధ్యతలను మొత్తం ప్రైవేట్ సంస్థలే చేపట్టనున్నాయి. అయితే ఎంఎంఆర్‌డీఏ నోడల్ ఏజెన్సీగా ఈ మొత్తం ప్రాజెక్ట్‌ను పర్యవేక్షించనుంది. ఈ వినూత్న ప్రాజెక్టు పూర్తి ప్రణాళిక, అమలు కోసం తదుపరి సన్నాహాలు వేగవంతంగా జరుగుతున్నాయి. ఇక ఈ పాడ్ ట్యాక్సీలు అమల్లోకి వస్తే ముంబైలో రవాణా వ్యవస్థ మరో స్థాయికి చేరుకోనుంది. అక్కడ సక్సెస్ అయితే.. ఈ పాడ్ ట్యాక్సీలు దేశంలోని మిగిలిన ప్రాంతాలకు విస్తరించనున్నారు.

# ప్రసార్ భారతి, ఆకాశవాణిలో కాపీ ఎడిటర్ ఉద్యోగాలు.. డిగ్రీ పాసైతే దరఖాస్తుకు అర్హులే!




**నమస్తే హైదరాబాద్ :** భారత ప్రభుత్వ పబ్లిక్ సర్వీస్ బ్రాడ్‌కాస్టర్ అయిన ప్రసార్ భారతి.. ఒప్పంద ప్రాతిపదికన ఏడాది కాలానికి కాపీ ఎడిటర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ కింద మొత్తం 29 కాపీ ఎడిటర్ ఉద్యోగాలను భర్తీ చేయనుంది. ఇందులో 21 పోస్టులు దూరదర్శన్, 8 పోస్టులు ఆకాశవాణిలో భర్తీ చేస్తారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చు. ఇతర వివరాలు ఈ కింద చెక్ చేసుకోండి.. ప్రసార్ భారతిలో కాపీ ఎడిటర్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు నోటిఫికేషన్‌లో సూచించిన విధంగా గ్రాడ్యుయేషన్ లేదా జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ లేదా తత్సమాన స్పెషలైజేషన్‌లో డిగ్రీ, పీజీ డిప్లొమాలో ఉత్తీర్ణత పొంది ఉండాలి. అలాగే ఐదేళ్ల ఉద్యోగానుభవం కూడా ఉండాలి. హిందీ/ఇంగ్లిష్‌తో పాటు సంబంధిత ప్రాంతీయ భాష పరిజ్ఞానం అవసరం. అభ్యర్థులకు వయోపరిమితి 35 ఏళ్లకు మించకూడదు. ఆసక్తి కలిగిన వారు ప్రకటన వెలువడిన 15 రోజుల్లోపు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి. ఈ ఉద్యోగ ప్రకటన నవంబర్ 11, 2025వ తేదీన విడుదలైంది.

ఈ పోస్టులకు అభ్యర్థులను రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు. షార్ట్‌లిస్ట్ అయిన అభ్యర్థులకు మాత్రమే ఇమెయిల్ ద్వారా సమాచారం అందుతుంది. ఎంపికైన వారికి దేశ వ్యాప్తంగా ఉన్న ప్రసార్ భారతి బ్రాంచుల్లో ఎక్కడైనా పని చేయవల్సి ఉ ంటుంది. నెలకు రూ.35 వేల వరకు జీతం చెల్లిస్తారు. ఇతర వివరాలు ఈ కింది నోటిఫికేషన్‌లో చెక్ చేసుకోవచ్చు.

# టీడీపీ ఉంటేనే నాయకులకు గుర్తింపు ఉంటుందన్న అనిత



**నమస్తే హైదరాబాద్ :** తెలుగుదేశం పార్టీ ఉంటేనే నాయకులుగా మనలాంటి వారికి గుర్తింపు ఉంటుందని, అధికారం చేతికి వచ్చిందన్న నిర్లక్ష్యం ఎవరిలోనూ ఉండకూడదని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం సారిపల్లిపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో పాయకరావుపేట నియోజకవర్గ టీడీపీ కమిటీల ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.కార్యక్రమం ప్రారంభంలో జిల్లా అధ్యక్షుడు తాతయ్య బాబుతో కలిసి మంత్రి అనిత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి, నూతన కమిటీల సభ్యులతో ప్రమాణం చేయించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో ఎన్నో అవమానాలు, కష్టాలు ఎదుర్కొన్న కార్యకర్తల సమష్టి కృషితోనే నేడు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కష్టపడి పనిచేసే వారికే పార్టీలో ప్రాధాన్యత ఉంటుంది. పదవులను అలంకరణగా కాకుండా బాధ్యతగా భావించాలి అని సూచించారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇదే స్ఫూర్తితో పనిచేసి కూటమి అభ్యర్థుల విజయం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. త్వరలోనే నర్సీపట్నం అడ్డు రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల నాటికి నియోజకవర్గంలో ప్రతి కుటుంబానికి ఉద్యోగం కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

# జగన్‌కు కుట్రలు ఈర్ష్య పెరిగిపోయాయన్న మంత్రి అనగాని



**నమస్తే హైదరాబాద్ :** వైసీపీ అధినేత జగన్ కు కుట్రలు, కుతంత్రాలతో పాటు ఈర్ష్య, అసూయ కూడా పెరిగిపోతున్నాయని రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులు సంతోషంగా ఉండటాన్ని ఆయన జీర్ణించుకోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు.ప్రభుత్వం రైతుల సాధికారత కోసం 'పంచసూత్రాలు' అమలు చేస్తుంటే, వారి మంచిని చూడలేక జగన్ ఏడుస్తున్నారని ఆయన మండిపడ్డారు. జగన్ పాలనలో రైతులకు అండగా నిలిచిన దాఖలాలు లేవని, వారిని ఆత్మహత్యల వైపు నెట్టారని ఆరోపించారు. రైతుల ఆత్మహత్యలే ఆయన పాలనకు నిదర్శనమని అన్నారు.ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న పంచసూత్రాల ద్వారా రైతులను ఆర్థికంగా బలోపేతం చేస్తామని అనగాని భరోసా ఇచ్చారు. రైతులు తాము పండించిన ఉత్పత్తులతో ప్రపంచ మార్కెట్‌లో పోటీ పడే స్థాయికి ఎదుగుతారని ధీమా వ్యక్తం చేశారు. రైతుల భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుతుంటే, జగన్ ఓర్వలేకే విమర్శలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు.

## ఆ జిల్లా లోని 217 మంది అంగన్వాడీ కార్యకర్తలకు ప్రమోషన్లు




**నమస్తే హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 5 వేల మినీ అంగన్వాడీలను.. మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా మార్చుతున్నట్లు ఏపీ మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి వెల్లడించారు. ఈ క్రమంలోనే పార్వతీపురం మన్యం జిల్లాలో 217 మంది అంగన్వాడీ కార్యకర్తలకు.. అంగన్వాడీ టీచర్లుగా పదోన్నతులు కల్పించనున్నట్లు వివరించారు. అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల పోషణ, ఆరోగ్యం, ప్రీస్కూల్ సేవలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి సంధ్యారాణి అన్నారు. అలాగే బాల్య వివాహాల నిర్మూలన కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మరోవైపు మినీ అంగన్వాడీ కేంద్రాలను.. అంగన్వాడీ కేంద్రాలుగా మారుస్తామని ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు హామీ ఇచ్చాయి.

ఇక ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో 7 వేల వరకూ మినీ అంగన్వాడీ కేంద్రాలు ఉండగా.. వాటిలో 5 వేల మినీలను.. అంగన్వాడీ కేంద్రాలుగా మారుస్తున్నాయి. మినీ అంగన్వాడీ కేంద్రాలలో కేవలం అంగన్వాడీ కార్యకర్తలు మాత్రమే ఉంటారు. ఆయాలు ఉండరు. ఈ అంగన్వాడీ కార్యకర్తలే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సహా ఇతరత్రా సేవలు అందించాల్సి ఉంటుంది. దీంతో వీరిపై పనిభారమే కాకుండా సేవల విషయంలో ఇబ్బందులు వస్తాయనే కారణంతో.. మినీ అంగన్వాడీ కేంద్రాలను.. మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా అప్ గ్రేడ్ చేస్తున్నారు.

దీంతో అంగన్వాడీ కార్యకర్త హోదా కూడా అంగన్వాడీ టీచర్‌గా మారనుంది. అలాగే వీటిలో ఆయాలను కూడా ఏర్పాటు చేస్తారు. కార్యకర్త జీతం కూడా రూ.7000 నుంచి రూ.11,500 వరకూ పెరుగుతుందని అధికారులు చెప్తున్నారు. ఈ క్రమంలోనే పార్వతీపురం మన్యం జిల్లాలో 217 మందికి అంగన్వాడీ టీచర్లుగా పదోన్నతి కల్పిస్తున్నట్లు తాజాగా మంత్రి సంధ్యారాణి వెల్లడించారు.


ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ కార్యక్రమంలో భాగంగా ఏపీలో అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అవసరమైన సేవలు అందిస్తారు. ఆరేళ్లలోపు వయసు గల పిల్లలతో పాటుగా, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందిస్తారు. చిన్నారుల ఆరోగ్య సంరక్షణతో పాటుగా వారి శారీరక, మానసిక, సామాజిక అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాల ద్వారా సహాయ సహకారాలు అందిస్తారు. అలాగే అంగన్వాడీ కేంద్రాలలో ప్రీప్రైమరీ విద్యను కూడా అందిస్తున్నారు. వీటికోసం అంగన్వాడీ టీచర్, ఆయాలను మెయిన్ అంగన్వాడీ కేంద్రాలలో ప్రభుత్వం అందుబాటులో ఉంచుతోంది.

## కొత్త జిల్లాల ఏర్పాటు అంశంపై సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు..

ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల పునర్విభజనపై సీఎం చంద్రబాబు నాయుడు కీలక సూచనలు చేశారు. ఈ అంశంపై ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీ ఇంకా విస్తృతంగా చర్చించాలని సీఎం ఆదేశించారు. కమిటీ మళ్లీ సమావేశమై ప్రతిపాదనలు, అభ్యంతరాలు, ప్రజల నుంచి వచ్చిన సూచనలను పరిశీలించాలని సూచించారు. తుది నిర్ణయాన్ని ముఖ్యమంత్రి అధ్యక్షతన తీసుకోనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. జిల్లాల విభజనపై సీఎం చంద్రబాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. మార్కాపురం, మదనపల్లె జిల్లాల ఏర్పాటుతో పాటు మంత్రుల కమిటీ ముందుకు వచ్చిన పలు జిల్లాల ఏర్పాటు ప్రతిపాదనలపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. అలాగే కొత్త జిల్లాల సరిహద్దులు, రెవెన్యూ డివిజన్ల పునర్విభజన, నియోజకవర్గ విస్తరణ వంటి అంశాలపై సీఎంతో మంత్రుల కమిటీ సమాలోచనలు చేసింది.సీఎం ఆదేశాల మేరకు జిల్లాల పునర్వవస్తీకరణపై మంత్రివర్గ ఉపసంఘం వివరణాత్మక నివేదికను సమర్పించింది. మంత్రులు అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్థన్ రెడ్డి, వంగలపూడి అనిత, నారాయణ, సత్యకుమార్ యాదవ్‌లతో కూడిన కమిటీ ఈ నివేదికను సీఎంకు అందించింది. గత ప్రభుత్వ కాలంలో అశాస్త్రీయంగా జరిగిన విభజనను సరిచేయాలనే దృష్టితో ఈ నివేదిక రూపొందించినట్టు ఉపసంఘం వివరించింది. ముఖ్యంగా మండలాలు, పంచాయతీలను విడదీయకుండా నియోజకవర్గానికి చెందిన ప్రాంతం ఒకే రెవెన్యూ డివిజన్‌లో ఉండేలా నిర్ణయం తీసుకున్నారు.

మార్కాపురం, మదనపల్లె కేంద్రాలుగా కొత్త జిల్లాల ఏర్పాటు విషయంలో ఉపసంఘం సానుకూలత తెలిపిన విషయంతో పాటు నూజివీడు నియోజకవర్గంను ఎన్టీఆర్ జిల్లాలోకి, కైకలూరును కృష్ణా జిల్లాలోకి, గూడూరును తిరుపతి నుంచి నెల్లూరులోకి తిరిగి చేర్చడంపై నివేదికలో పేర్కొంది. గన్నవరం నియోజకవర్గంను ఎన్టీఆర్ జిల్లాలో కలపడాన్ని స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించి ఉపసంఘం తీసుకున్న నిర్ణయాన్ని సమావేశంలో ప్రస్తావించింది. ప్రస్తుతం రాష్ట్రంలో 77 రెవెన్యూ డివిజన్లు ఉండగా మరో ఆరు కొత్త డివిజన్లు చేరే అవకాశాన్ని కూడా నివేదికలో తెలిపింది.

జనగణన ప్రకారం ఈ ప్రక్రియను డిసెంబర్ 31లోగా పూర్తి చేయాల్సి ఉంది. ఇందుకోసం ఉపసంఘం రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి వచ్చిన దాదాపు 200 వినతులను పరిశీలించింది. కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంఘాలతో పాటు నేరుగా ప్రజల సూచనలను కూడా పరిగణలోకి తీసుకుంది. వీటన్నింటినీ సీఎం దృష్టికి తీసుకెళ్లగా మరింత విస్తృతంగా చర్చించాలని మంత్రి వర్గ ఉపసంఘానికి సీఎం సూచించారు. దీంతో మరోసారి మంత్రుల కమిటీ సమావేశం కానుంది. అనంతరం సీఎంతో చర్చించి ప్రకటన చేయనుంది.




# ఏపీలో ఆ రైల్వే స్టేషన్‌కు మహర్దశ.. ఎయిర్‌పోర్టు రేంజులో అభివృద్ధి

**నమస్తే హైదరాబాద్ :** విజయవాడ రైల్వే స్టేషన్ కొత్త రూపు సంతరించుకుంటోంది. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ పద్ధతిలో స్టేషన్ రీడెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద విజయవాడ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయనున్నారు. అత్యాధునిక వసతులతో ఎయిర్‌పోర్టు తరహాలో విజయవాడ రైల్వే స్టేషన్‌ను తీర్చిదిద్దేందుకు అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు. అయితే రైల్వే స్టేషన్ అభివృద్ధి చేస్తున్నప్పటికీ.. విజయవాడ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్ సంఖ్యలో మాత్రం మార్పు లేదు. ప్రస్తుతం విజయవాడ రైల్వేస్టేషన్‌లో పది ప్లాట్?ఫామ్‌లు ఉన్నాయి. అయితే పెరుగుతున్న అవసరాలు, ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని రెండు కొత్త ప్లాట్‌ఫామ్‌లు నిర్మించాలని.. ప్లాట్‌ఫామ్‌ల సంఖ్యను 10 నుంచి 12కు పెంచాలని తొలుత రీడెవలప్‌మెంట్ ప్రణాళికలో పేర్కొన్నారు. అయితే తాజాగా విజయవాడ రైల్వేస్టేషన్‌లో కొత్త ప్లాట్ ఫామ్‌లు వద్దని రైల్వే అధికారులు నిర్ణయించినట్లు సమాచారం.


అమరావతి రాజధాని ప్రాంతం కోసం రూపొందించిన సమగ్ర రైలు అభివృద్ధి ప్రణాళిక కారణంగా విజయవాడ రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారమ్‌ల సంఖ్యను పెంచకూడదని రైల్వే అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. విజయవాడ సమీపంలో ఉన్న రాయనపాడు, గుణదల రైల్వే స్టేషన్‌లను ప్రపంచ స్థాయి సౌకర్యాలతో శాటిలైట్ రైల్వే స్టేషన్‌లుగా అభివృద్ధి చేస్తున్న సంగతి తెలిసిందే. అలాగే ఇటీవల జరిగిన ఓ సమావేశంలోనూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దక్షిణ మధ్య రైల్వే అధికారులకు పలు సూచనలు చేశారు. రాబోయే అమరావతి రైల్వే స్టేషన్‌లో మెగా టెర్మినల్ నిర్మించాలని, ప్రస్తుతం ఉన్న గన్నవరం రైల్వే స్టేషన్‌ను మరొక టెర్మినల్‌గా అభివృద్ధి చేయాలని ఆదేశించారు.

ఈ నేపథ్యంలో విజయవాడ రైల్వేస్టేషన్‌లో కొత్త ప్లాట్‌ఫారమ్‌ల నిర్మాణం అవసరం లేదని నిర్ణయించినట్లు విజయవాడ డీఆర్‌ఎం కార్యాలయం తెలిపింది. రాజధాని ప్రాంతంలోని ప్రధాన రైల్వే స్టేషన్ అప్‌గ్రేడేషన్ ప్రాజెక్టులను పరిగణనలోకి తీసుకుంటే,



విజయవాడ రైల్వే స్టేషన్‌లో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుందని., ట్రాఫిక్‌ను శాటిలైట్ రైల్వే స్టేషన్‌లకు, ప్రతిపాదిత రైల్వే టెర్మినల్‌లకు మళ్లించడం వలన కొత్త ప్లాట్‌ఫామ్ నిర్మించాల్సిన అవసరం ఉండదనే కారణంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మరోవైపు విజయవాడ రైల్వేస్టేషన్‌ను ప్రపంచ స్థాయి సౌకర్యాలతో అభివృద్ధి చేయనున్నారు, తూర్పు, పశ్చిమ వైపు కొత్తగా అత్యాధునిక భవనాలు నిర్మించనున్నారు. అలాగే స్టేషన్‌లోని పది ప్లాట్ ఫారాలను 40,600 చదరపు మీటర్ల విస్తీర్ణంలో కవర్ ఓవర్ ప్లాట్‌ఫారమ్‌లుగా పునరుద్ధరించనున్నారు. విజయవాడ రైల్వే స్టేషన్‌కు తూర్పు, పశ్చిమ వైపు 144 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పుతో సెంట్రల్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించనున్నారు. వీటితో పాటు మరో రెండు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను కూడా నిర్మించాలని అధికారులు ప్రతిపాదించారు.

# ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టంపై సీఎం చంద్రబాబు సమీక్ష



రాష్ట్రంలో సుపరిపాలన అందించే దిశగా, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పౌర సేవలను మరింత పారదర్శకంగా ప్రజలకు చేరవేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక విప్లవాత్మకమైన అడుగు ముందుకు వేసింది. రాష్ట్రంలోని ప్రతి కుటుంబాన్ని ఒక యూనిట్‌గా పరిగణించి, వారి సమగ్ర సమాచారంతో కూడిన స్మార్ట్ ఫ్యామిలీ కార్డ్’ను జారీ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ‘ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టం అమలు ద్వారా కుటుంబ సాధికారిత సాధించాలని ఆయన స్పష్టం చేశారు.సోమవారం నాడు సచివాలయంలో ఎఫ్‌బీఎంఎస్‌పై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, పౌర సేవలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ శాఖల వద్ద ఉన్న సమాచారాన్ని క్రోడీకరించి, ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చవచ్చని అన్నారు. ఈ బృహత్తర కార్యక్రమానికి సాంకేతిక వెన్నెముకగా రియల్ టైమ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలోని డేటా లేక్‌ను వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆర్టీజీఎస్ వద్ద ఉన్న సమాచారాన్నే ప్రామాణికంగా తీసుకుని ఇతర శాఖలు కూడా వాడుకోవాలని ఆదేశించారు.రాష్ట్రంలోని 1.4 కోట్ల కుటుంబాలకు వచ్చే ఏడాది జూన్ నాటికి క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ ఫ్యామిలీ కార్డులను పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ కార్డులో దాదాపు 25 రకాల వివరాలతో పాటు ‘పీ4’ లాంటి అంశాలను కూడా పొందుపరచాలని సూచించారు. కుటుంబంలోని సభ్యుల వ్యాక్సినేషన్ వివరాలు, ఆధార్, ఎఫ్‌బీఎంఎస్ ఐడీ, కుల ధృవీకరణ పత్రం, పౌష్టికాహార స్థితి, రేషన్ కార్డు, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, వృద్ధులు, వితంతువులకు అందే పెన్షన్ల వరకు అన్ని వివరాలను ఈ కార్డు ద్వారా ట్రాక్ చేసేలా వ్యవస్థను రూపొందించాలని అన్నారు.కేవలం పెన్షన్లు, రేషన్ వంటి పథకాలకు మాత్రమే ఈ వ్యవస్థను పరిమితం చేయవద్దని, పౌరులకు సంబంధించిన స్టాటిక్, డైనమిక్ డేటాను ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ, వారి జీవితంలోని ప్రతి దశలో ప్రభుత్వ సేవలు సులభంగా అందేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు. కొన్ని పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో ఎదురవుతున్న సవాళ్లను ఈ వ్యవస్థ ద్వారా అధిగమించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో స్వర్ణాంధ్ర విజన్ యూనిట్ ద్వారా కుటుంబ వివరాలు నిరంతరం అప్‌డేట్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఆధార్ సహా అన్ని వివరాలు ఈ ఒక్క కార్డు ద్వారానే తెలిసేలా పటిష్టమైన వ్యవస్థను సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. 2026 జనవరి నాటికి పూర్తి సమాచారాన్ని క్రోడీకరించి, జూన్ నాటికి కార్డుల పంపిణీ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, ఆర్థిక, వైద్యారోగ్య, గ్రామవార్డు సచివాలయ, పురపాలక, ప్రణాళికా శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మొదలైన ‘మిషన్ బెంగాల్’.. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ టార్గెట్ ఇదే

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అఖండ విజయం సాధించిన బీజేపీ.. వచ్చే ఏడాది మార్చి-ఏప్రిల్‌లో జరగనున్న పశ్చిమ్ బెంగాల్‌లోనూ కాషాయ జెండాను ఎగరువేయాలనే కృతనిశ్చయంతో ఉంది. మమతా బెనర్జీ, ఆమె పార్టీ తృణమూల్ కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకుని, బీజేపీ ఎన్నికల యంత్రాంగం అప్పుడే కార్యాచరణ మొదలుపెట్టింది. బెంగాల్‌లో వచ్చే ఏడాది మార్చి-ఏప్రిల్‌లో ఎన్నికలు జరుగుతాయని, బీహార్ విజయం ఇచ్చిన అత్మవిశ్వాసంతో దీదీని గద్దె దింపడానికి వ్యూహరచన చేసినట్టు ఆ పార్టీ వర్గాలు సోమవారం తెలిపాయి. కానీ కేవలం బీజేపీ ప్రధాన దృష్టంతా మమతా బెనర్జీపై మాత్రమే కాదని, ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీని వ్యతిరేకించే తృణమూల్ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుంటుందని పేర్కొన్నాయి.వీలైనంత మేర టీఎంసీకి ఉన్న ఆదరణను తగ్గించడమే దీని లక్ష్యం. అయితే, తృణమూల్ అధినేత్రిని విస్మరించాలని కాదు. దీంతో పాటు ఎప్పటి మాదిరిగానే వారసత్వ రాజకీయాల అంశంపై కూడా బీజేపీ దృష్టి సారిస్తుంది. మమతా బెనర్జీ రాజకీయ వారసుడు ఆమె మేనల్లుడని ప్రచారం జరగుతుండగా... ప్రజల్లో ఆయనపై అంతగా సానుకూలత లేదనే సంకేతాలు వస్తున్నాయి. ఈ పరిస్థితి తమకు అనుకూలంగా మారి, క్షేత్రస్థాయి వనరులను తమవైపు తిప్పుకునేందుకు అవకాశం కల్పిస్తుందని పార్టీ వ్యూహం గురించి తెలిసిన ఓ బీజేపీ నేత అన్నారు.కాగా, 2021 అసెంబ్లీ ఎన్నికలకు ముందు సువేందు అధికారి సహా టీఎంసీకి చెందిన ముఖ్య నేతలు బీజేపీలో చేరారు. దీదీకి కుడి భుజమైన సువేందు.. పార్టీలో అభిషేక్ పెత్తనాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. గత ఎన్నికల్లో నందిగ్రామ్‌లో మమతాను సువేందు ఓడించిన విషయం తెలిసిందే. కానీ, ఈసారి మాత్రం టీఎంసీకి చెందిన అసమ్మతి నేతలను పార్టీలోకి చేర్చుకునే ప్రణాళిక లేదని, దీని వల్ల పార్టీ ఓటు శాతం గణనీయంగా పెరుగుతుందని ఆశించడంలేదని వారు పేర్కొన్నారు.

దీనికి బదులు టీఎంసీ కార్యకర్తలను చేర్చుకుంటే బీజేపీ ఇంకా దూకుడుగా, మరింత సమర్థవంతంగా ఎన్నికల్లో ముందుకెళ్తుందని భావిస్తున్నారు. అంతేకాదు, పార్టీలో కొత్త నాయకులను చేర్చుకోవడం వల్ల ఇప్పటికే ఉన్నవారిని పక్కనబెట్టాల్సి వస్తుందని, కార్యకర్తలను చేర్చుకుంటే ఆ పరిస్థితి ఉండదని అంటున్నారు. బిహార్‌లో బీజేపీ, జేడీయూ సహా దాని మిత్రపక్షాలు కుల సమీకరణాలను సరిగ్గా అమలు చేసి విజయం సాధించాయి. కానీ, బెంగాల్‌లో పరిస్థితి దీనికి విరుద్ధం. ఇతర రాష్ట్రాలతో పోల్చితే అక్కడ కుల రాజకీయాలకు అంతగా ఆస్కారం లేదు. అందుకే ఇక్కడ బీజేపీ ప్రాంతీయ, మత సమీకరణాలపై ఫోకస్ పెట్టింది. హిందూ-ముస్లిం సమీకరణాలుబెంగాల్‌లో ముస్లిం జనాభా సుమారు 30 శాతంగా ఉంటుంది. కానీ, కేవలం 30 నుంచి 40 స్థానాల్లోనే



వీరి ప్రభావం ఉంటుంది. బీజేపీ విశ్లేషణ ప్రకారం.. ముస్లింలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో టీఎంసీకి గణనీయంగా ఓట్లు వస్తాయి. కానీ ఇది చాలా కొద్ది నియోజకవర్గాలకు పరిమితం కావడంతో ఆ పార్టీ గెలుచుకునే స్థానాల సంఖ్యపై పెద్దగా ప్రభావం ఉండదు. ఎన్నికలో గెలిచిన స్థానాలే కీలకం కానీ ఓట్లు కాదు. దీనికి కౌంటర్‌గా ఇతర ప్రాంతాల్లో హిందూ ఓటర్లను ఆకట్టుకోవడం ద్వారా లబ్ధి పొందాలని బీజేపీ ఆశిస్తోంది. ఈ విషయంలో తమ పార్టీ బలమైన స్థితిలో ఉందని, పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక బీజేపీ నేత అన్నారు.ఇతర అంశాలుగత కొన్నేళ్లుగా బంగ్లాదేశ్ చొరబాటుదారుల విషయంలో పదేపదే మమతా బెనర్జీపై బీజేపీ దాడి చేస్తోంది. సరిహద్దులు దాటి వచ్చిన అక్రమ చొరబాటుదారులు ఓటర్ల జాబితాలో చేరుతున్నప్పటికీ.. ఆమె కన్నెత్తి చూడటం లేదని ఆరోపిస్తోంది. అయితే, తృణమూల్ మాత్రం బీజేపీని స్థానికేతరులని ఆరోపిస్తోంది. గుజరాత్ (ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా) నుంచి వచ్చే శక్తులు ‘బెంగాల్ వ్యతిరేకులు’ అని ఎదురుదాడి చేస్తోంది.కాగా, 2019, 2024 లోక్‌సభ, 2016, 2021 బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మొత్తం 100కిపైగా స్థానాల్లో విజయం సాధించింది. ఇది బెంగాల్‌లో ఆ పార్టీకి పెరుగుతున్న ప్రాధాన్యతను సూచిస్తుంది. ఈ ప్రాంతాలపై దృష్టి పెట్టి, టార్గెట్‌గా పెట్టుకున్న 160 నుంచి 170 స్థానాలను గెలవడానికి బీజేపీ బలంగా ప్రణాళికలు వేస్తోంది.

## ఎన్ని అడ్డంకులు సృష్టించిన పట్టాభి స్మారక భవనాన్ని నిర్మిస్తాం - మంత్రి కొల్లు రవీంద్ర,

ఎపిఎస్ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు





**నమస్తే హైదరాబాద్ :** ఎపిఎస్ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు పేర్ని నాని ఎన్ని అడ్డంకులు సృష్టించిన స్వాతంత్ర సమరయోధుడు, ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపకుడు స్వర్గీయ భోగరాజు పట్టాభి సీతారామయ్య పేరిట స్మారక భవనాన్ని నిర్మించి ఆ భవనం ద్వారా పేద ప్రజలకు వివిధ రకాల శిక్షణలు ఇచ్చి, పేదల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. స్వాతంత్ర సమరయోధుడు, ఆంధ్ర బ్యాంకు వ్యవస్థాపకులు స్వర్గీయ భోగరాజు పట్టాభి సీతారామయ్య 146 వ జయంతి సందర్భంగా జడ్పీ సెంటర్ లోని ఆ మహనీయుని కాంస్య విగ్రహానికి సోమవారం మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్, కొనకళ్ళ నారాయణరావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, గొర్రెపాటి గోపీచంద్, బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్, యూనియన్ బ్యాంక్ అధికారులు, ఆంధ్ర బ్యాంక్ రిటైర్డ్ ఎంప్లాయిస్ తదితరులు పూలమాలలు వేసి, ఘనమైన నివాళులు అర్పించి, ఆ మహనీయుని సేవలను స్మరించుకుని, మంత్రి కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ పేర్ని నాని, వైసిపి కార్పొరేటర్లు స్వతంత్ర సమరయోధుడు, ఆంధ్ర బ్యాంకు వ్యవస్థాపకుడు స్వర్గీయ భోగరాజు పట్టాభి సీతారామయ్య పేరిట నిర్మించే స్మారక భవన నిర్మాణానికి హైకోర్టు వారి ఉత్తర్వులను కూడా అమలు చేయకుండా, యూనియన్ బ్యాంక్ వారు నిధులు ఇస్తానన్నా కూడా మచిలీపట్నం నగర కార్పొరేషన్ లో ఏ విధంగా పేర్ని నాని, వైసీపీ కార్పొరేటర్లు ఎలా అడ్డుపడుతున్నా రో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. పేర్ని నాని, వైసీపీ కార్పొరేటర్లు ఇంకా ఎంతోకాలం పట్టాభి స్మారక భవన నిర్మాణానికి అడ్డుపడలేరని, ఇప్పటికైనా వైసీపీ కార్పొరేటర్లు కౌన్సిల్లో పట్టాభి స్మారక భవనం నిర్మాణం కోసం తీర్మానం చేస్తే బాగుంటుంది అని, లేకపోతే చరిత్ర హీనులు అవుతారని అన్నారు. వైసీపీ నేతలు ఎన్ని అడ్డంకులు సృష్టించిన పట్టాభి స్మారక భవన నిర్మాణం పూర్తి చేసి, పేద ప్రజలకు ఆ భవనం ద్వారా వివిధ రకాల శిక్షణలు ఇప్పించి వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.

పట్టాభి సీతారామయ్య వ్యవసాయదారులకు రుణ సదుపాయం కల్పించడం కోసం అపార కృషి సల్పిన రైతు శ్రేయోభిలాషి అన్నారు. స్వర్గీయ పట్టాభి సీతారామయ్య ముక్కుసూటి మనిషిగా, స్వాతంత్ర సమరశీలిగా, మహాత్మా గాంధీ ఆప్తునిగా, రాజకీయ చతురునిగా ప్రజల మన్ననలు పొందిన మహనీయుడు అన్నారు. ఆంధ్ర బ్యాంక్ స్థాపించి ఎంతోమంది జీవనోపాధికి తోడ్పాటునందించిన గొప్ప వ్యక్తి అన్నారు. అలాంటి వ్యక్తిని స్మరించుకోవడం మన అందరి కర్తవ్యం అన్నారు.

ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్, మాజీ ఎంపీ, కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ పట్టాభి సీతారామయ్య సామాన్య ప్రజలకు బ్యాంకులు అందుబాటులో లేని రోజుల్లో అప్పుల కోసం అన్నదాతలు అవస్థలు పడుతున్న రోజుల్లో వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం ఆంధ్ర బ్యాంకు ను మన మచిలీపట్నం కేంద్రంగా స్థాపించి ఆ బ్యాంకును అనేక శాఖలుగా విస్తరింపచేసి మన మచిలీపట్నానికి ఎంతో పేరు తెచ్చిన గొప్ప వ్యక్తి అన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి పేరిట స్మారక భవనం నిర్మించి ప్రజలకు ఉపయోగపడే విధంగా సేవలు అందిద్దాం అంటే వైసీపీ నేతలు అడ్డుపడడం సిగ్గుచేటు అన్నారు.

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, గొర్రె పాటి గోపీచంద్ మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో పట్టాభి సీతారామయ్య కీలకపాత్ర పోషించారని, ఆ మహనీయుడు పుట్టింది గుండు గొలనులో అయినా, రాజకీయ భిక్ష పెట్టింది, పలు రంగాలలో పరిణితి చెందడానికి దోహదం కల్పించింది మన మచిలీపట్నం మే అన్నారు.

బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్,

పి. వి. ఫణి కుమార్ మాట్లాడుతూ మన మచిలీపట్నానికి వన్నెతెచ్చిన మహనీయుడు స్వర్గీయ పట్టాభి సీతారామయ్య పేరిట

స్మారక భవనం నిర్మిస్తానికి అందరూ ముందుకు వస్తుంటే, మాజీ మంత్రి పేర్ని నాని, వైసిపి కార్పొరేటర్లు ఈ విషయంపై ఎందుకు నోరు మెదపడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం పేర్ని నాని, వైసిపి కార్పొరేటర్ లపై ఉంది అన్నారు. ఇప్పటికైనా వైసీపీ కార్పొరేటర్లు పట్టాభి స్మారక భవనానికి హైకోర్టు ఉత్తర్వులు అమలు చేసేలా చూడాలని ఫణి కుమార్ కోరారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్, మోటమర్రి వెంకట బాబా ప్రసాద్, జనసేన మచిలీపట్నం నగర అధ్యక్షుడు, గడ్డం రాజు, సింగరాజు గోవర్ధన్, ఎం. సుబ్రహ్మణ్యం, సేతురామయ్య, వి ఎస్ ఎస్ ఆర్ శర్మ తదితరులతో పాటుగా యూనియన్ బ్యాంక్ అధికారులు, ఆంధ్ర బ్యాంక్ రిటైర్డ్ ఎంప్లాయిస్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కొల్లు రవీంద్ర చొరవతో దళిత రైతుల జీవితాల్లో వెలుగు

**పట్టాదారు పాస్ పుస్తకాలు లేక అవస్థలు పడుతున్న వారికి శాశ్వత పరిష్కారం**

**రైతన్నా మీకోసం కార్యక్రమంలో 60 మంది దళిత రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేత**



**నమస్తే హైదరాబాద్ :** ఏళ్ల తరబడి అపరిష్కృతంగా నెలకొన్న పట్టాదారు పాస్ పుస్తకాల సమస్యను పరిష్కరించి దళిత రైతు కుటుంబాల్లో వెలుగులు నింపారు రాష్ట్ర గనులు, భూగర్భవనరులు మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర. బందరు మండలం ఎస్ఎన్ గొల్లపాలెంలో నిర్వహించిన 'రైతన్నా మీకోసం' కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. అన్నదాత సుఖీభవ పథకంతో రెండో విడత నగదు జమ అయిన పత్రాలను రైతులకు అందించారు. గత ఐదేళ్లుగా పరిష్కారం లేక ఇబ్బందులు పడుతున్న 60 దళిత రైతు కుటుంబాలకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందించారు. గత ఐదేళ్లు పట్టా పుస్తకాలు అందించకుండా ఇబ్బందులు పెట్టారని, రైతులకు వ్యతిరేకంగా కోర్టుకు వెళ్లారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదాత సుఖీభవ పథకం నిధులు అందించడంతో పాటుగా పట్టాదారు పాస్ పుస్తకాలు అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించి మా జీవితాల్లో వెలుగులు నింపిన కూటమి ప్రభుత్వానికి అండగా ఉంటామని రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, టీడీపీ సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచే దుర్గాప్రసాద్ (నాని), మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, తెలుగు రైతు విభాగం జిల్లా అధ్యక్షులు గోపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణులను కించపరిచే విధంగా పాటలు పాడుతున్న వారి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

### బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్



**నమస్తే హైదరాబాద్ :** బ్రాహ్మణులను కించపరిచే విధంగా పాటలు పాడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి అంటూ చిలకలపూడి పోలీసు స్టేషన్ లో సీఐ, ఎస్.కె అబ్దుల్ నబీ కి సోమవారం కంప్లైంట్ ఇచ్చిన బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్,

పి. వి. ఫణి కుమార్, మచిలీపట్నం బ్రాహ్మణ సేవా సంఘం నేతలు, ఎం. సుబ్రహ్మణ్యం, వి ఎస్ ఎస్ ఆర్ శర్మ, లక్క వజ్జుల రామకృష్ణ, వేమూరి సాయి, శివ, చోడవరపు లక్ష్మీ ప్రసూన లు చిలకలపూడి పోలీస్ స్టేషన్ లో కంప్లైంట్ ఇచ్చిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇటీవల డప్పు చంద్రన్న సంస్మరణ సభలో పల్లవోలు రమణ అనే గాయకుడు బ్రాహ్మణ జాతిని, బ్రాహ్మణుల ఆచార వ్యవహారాలను కించపరుస్తూ బ్రాహ్మణులను వాడు, వీడంటూ ఏక వచనంతో సంబోధిస్తూ అంగీ తొడగవెందుకయ్యా ఓ బాపనయ్య అంటూ పాట పాడటం యావత్తు బ్రాహ్మణ జాతిని అవమానించడమే నన్నారు.

భారత రాజ్యాంగం మనకు నచ్చిన మతాన్ని నచ్చిన కులాన్ని నచ్చిన వృత్తిని ఎంచుకునే హక్కు ఇచ్చింది అని, ఎవరి కులం ఎవరి మతం వారు ఆచరించవచ్చు అన్నారు. ఎవరి మతాన్ని వాళ్లు ప్రచారం చేసుకోవచ్చు, కానీ ఇతర మతాలను, కులాలను కించపరిచే విధంగా మాట్లాడడం నేరం అవుతుంది అన్నారు. కానీ పల్లవోలు రమణ బ్రాహ్మణ కులాన్ని మరియు బ్రాహ్మణులను దూషిస్తూ వారి ఆచార వ్యవహారాలను అవహేళన చేస్తూ పాటల రూపంలో బ్రాహ్మణులకు వ్యతిరేకంగా, ఇతర కులాల వారిని మతాల వారిని రెచ్చగొట్టే విధంగా పాటలు పాడటం నేరం అవుతుంది అన్నారు.

పల్లవోలు రమణ పాట యూట్యూబ్ లలో ఎంతోమంది చూస్తున్నారు. ఆ పాటను యూట్యూబ్ లలో చూస్తున్న వారు బ్రాహ్మణులను అవమానపరచడమే అని భావిస్తున్నారు అన్నారు. బ్రాహ్మణులు ధరించే జంధ్యాన్ని గాయత్రీ మాతగా ఆరాధిస్తారు. బ్రాహ్మణులే కాకుండా వైశ్య, క్షత్రియ ఇతర కులాలు కూడా జంధ్యాన్ని ధరిస్తారు. గాయత్రీ దేవిగా భావిస్తారు. అలాంటి జంధ్యాన్ని తీసివేయమని అవహేళన చేస్తూ పాటలు పాడటం ఆ గాయత్రి మాతను అవమానపరచడమే అవుతుంది అన్నారు.

అంటే ఒక బ్రాహ్మణులనే కాకుండా యావత్తు సమాజాన్ని అవమానించడమే నని, బ్రాహ్మణులకు వ్యతిరేకంగా ఇతర కులాల వారిని రెచ్చగొట్టే విధంగా ఆ పాట ఉంది అన్నారు. కావున ఆ పాటను వెంటనే యూట్యూబ్ ల నుంచి తొలగించవలసిందిగాను, ఆ పాట పాడిన గాయకుల పై క్రిమినల్ కేస్ నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సిందిగా చిలకలపూడి పోలీసు వారిని కోరాము అన్నారు. అదేవిధంగా సదరు పాటను యూట్యూబ్ నుంచి తొలగించి పల్లవోలు రమణ మరియు జి. డి. నరసయ్య తదితరులు ఆ పాట పాడిన వారిపై చట్టపరమైన చర్యలు పోలీసు వారు తీసుకోకపోతే ప్రైవేట్ కేసులు వేయడానికి కూడా వెనుకాడము అని తెలిపారు. ఆ పాట సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉందని, అలాంటివారు సమాజానికి ప్రమాదకరమని వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని పోలీస్ అధికారులను కోరాము అన్నారు.

## అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరు గా దాసరి శివ నాగరాజు నియామకం



**నమస్తే హైదరాబాద్ :** కృష్ణాజిల్లా పెడన నియోజవర్గం పెడన మండలం బల్లి పరుగు గ్రామానికి కు చెందిన దాసరి శివ నాగరాజు ను అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరు గా నియమిస్తూ ప్రభుత్వం జీ.వో నెంబర్ 459 ని విడుదల చేసింది. ఈ సందర్భంగా దాసరి శివ నాగరాజు తనకు ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ కి,మంత్రివర్యులు కొల్లు రవీంద్ర కి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు కి ప్రత్యేక కృత్ఞతలు తెలిపారు స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం లో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ని కలిసి సత్కరించారు.

## కార్యకర్తల సమష్టి కృషితోనే అధికారంలోకి రాగలిగాము



**నమస్తే హైదరాబాద్ :** పార్టీ ఉంటేనే నాయకులుగా మనలాంటి వారికి గుర్తింపు ఉంటుందని, అధికారం చేతికి వచ్చిందన్న నిర్లక్ష్యం ఎవరిలోనూ ఉండకూడదని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం సారిపల్లిపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో పాయకరావుపేట నియోజకవర్గ టీడీపీ కమిటీల ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.కార్యక్రమం ప్రారంభంలో జిల్లా అధ్యక్షుడు తాతయ్య బాబుతో కలిసి మంత్రి అనిత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి, నూతన కమిటీల సభ్యులతో ప్రమాణం చేయించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "గత ప్రభుత్వ పాలనలో ఎన్నో అవమానాలు, కష్టాలు ఎదుర్కొన్న కార్యకర్తల సమష్టి కృషితోనే నేడు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కష్టపడి పనిచేసే వారికే పార్టీలో ప్రాధాన్యత ఉంటుంది. పదవులను అలంకరణగా కాకుండా బాధ్యతగా భావించాలి" అని సూచించారు.

## మాక్ అసెంబ్లీకి నన్ను పంపించండి

### ప్రధమ స్థానంలో నిలిచిన విద్యార్థిని ఆవేదన




**నమస్తే హైదరాబాద్ :**రాష్ట్ర విద్యాశాఖ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విద్యార్థుల ఎంపిక ప్రక్రియ గందరగోళంగా మారింది. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒక్కో నియోజకవర్గంలోని ఆయా ఉన్నత పాఠశాలలో 8,9,10 తరగతి విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థుల్లో నియోజకవర్గ నుంచి ఒక విద్యార్థిని ఎంపిక చేసి ఈ నెల 26న విజయవాడలో నిర్వహించనున్న మాక్ అసెంబ్లీకి పంపించనున్నారు. అయితే పెడన నియోజకవర్గం లో విద్యార్థుల ఎంపికలో గందరగోళం నెలకొంది. పెడన పట్టణంలోని తోటమూల బట్ట మోహనరావు హైమావతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పరసా చాందిని అనే విద్యార్థిని ప్రథమ స్థానంలో నిలిచింది. అయితే 175 నియోజకవర్గాలకు ఈ పోటీలలో గెలిచి ప్రథమ స్థానంలో మాక్ అసెంబ్లీకి పంపిస్తామని జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రకటన చేసిన విషయం అందరికీ తెలిసినదే. ప్రథమ స్థానంలో నిలిచిన ( పరసా చాందిని)నేను ఎంతో కష్టపడి ప్రతిభ కనబరిచానని నన్ను మాక్ అసెంబ్లీకి పంపించాలని మంత్రి నారా లోకేష్ ను కోరారు. విద్యార్థిని పక్కన పెట్టి పెడన నియోజకవర్గం నుండి తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థినిని పంపించడంపై మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థి తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు.


# సినిమా



## మహేష్ రిజెక్ట్ చేసిన కథతో పవన్ కల్యాణ్ సినిమా.

### కట్ చేస్తే బాక్సాఫీస్ రికార్డులు బద్దలు.

సినిమా కథల ఎంపికలో ఒక్కో హీరోకు ఒక్కో క్యాలిక్యులేషన్ ఉంటుంది. డైరెక్టర్ చెప్పిన కథ తనకు సూటవుతుందా? అభిమానులకు నచ్చుతుందా? కామన్ ఆడియెన్స్ చూస్తారా? .. ఇలా ఒక సినిమా ఎంపికలో చాలా అంశాలు పరిగణణలోకి వస్తాయి. వివిధ సమీకరణాలను బేరీజు వేసుకుని కొన్నిసార్లు తమ దగ్గరకు వచ్చిన మంచి సినిమా కథలను కూడా రిజెక్ట్ చేస్తారు. దీంతో ఆ సినిమా కథలు వేరే హీరోల దగ్గరకు వెళ్లిపోతాయి. అలా చేతుల మారిన సినిమా కథలు ఒక్కోసారి హిట్ అవ్వొచ్చు.. మరోసారి ఫ్లాఫ్ అవ్వొచ్చు. టాలీవుడ్ స్టార్ హీరోలైన పవన్ కల్యాణ్, మహేష్ బాబుల విషయంలో కూడా ఇది జరిగింది. అవును.. మహేష్ బాబు వద్దన్న కథతో పవన్ కల్యాణ్ సినిమా చేశాడు.. కట్ చేస్తే.. ఆ సినిమా బాక్సాఫీస్ రికార్డులు బద్దలు కొట్టింది. అంతేకాదు పవన్ కు స్టార్ హీరో ఇమేజ్ ను మరింత రెట్టింపు చేసింది. ముఖ్యంగా యూత్ లో పవన్ ఫాలోయింగ్ ను అమాంతం పెంచేసింది. పవన్ కల్యాణ్ కెరీర్ లోనే కల్ట్ క్లాసిక్ గా ఈ సినిమా ఎప్పటికీ నిలిచిపోతుంది. రీ రిలీజ్ లోనూ ఈ సినిమాకు భారీ కలెక్షన్లు వచ్చాయి. ఇక టీవీలో ఎప్పుడు వచ్చినా ఈ సినిమాను అసలు వదిలిపెట్టరు. ఇంతకీ ఆ సినిమా ఏదనుకుంటున్నారా? ఖుషిఈ సినిమాకు నటుడు ఎస్జే సూర్య దర్శకత్వం వహించాడు. భూమిక హీరోయిన్ గా నటించింది. 2001లో రిలీజైన ఈ సినిమా సృష్టించిన రికార్డులు అన్నీ ఇన్నీ కావు. అయితే ఈ సినిమాకు హీరోగా పవన్ కల్యాణ్ ఫస్ట్ ఛాయిస్ కాదట. మొదట ఈ సినిమా స్టోరీని ఎస్ జె సూర్య మహేష్ బాబు తో చేయాలని అనుకున్నారట.అయితే అప్పటికే మహేష్ చేతిలో పలు సినిమాలు ఉండడం, ఇతర కారణాలతో ఖుషి సినిమాపై పెద్దగా ఇంట్రెస్ట్ చూపించలేదట. దీంతో ఇదే కథను పవన్ కల్యాణ్ తో తీసి బ్లాక్ బస్టర్ కొట్టాడు ఎస్జే సూర్య.కాగా ఖుషి సినిమా తర్వాత ఎస్జే సూర్యకు మరో మంచి ఆఫర్ ఇచ్చాడు మహేష్ బాబు. వీరి కాంబినేషన్ లో వచ్చిన చిత్రం నాని. అయితే ఈ సినిమా పెద్దగా ఆడలేదు. దీంతో ఎస్ జే సూర్య క్రమంగా డైరెక్షన్ నుంచి యాక్టింగ్ వైపు అడుగులు వేశాడు.






## పరగడుపున ఉప్పు నీళ్లు తాగితే శరీరంలో ఏం మార్పులు జరుగుతాయో తెలుసా?


ఉప్పు ఆరోగ్యానికి అంత మంచిది కాదనేది చాలామంది నిపుణులు చెబుతున్న మాట. ఉప్పు లేకుండా చేసే పలు వంటలు కూడా వచ్చేశాయి. ఉప్పు వల్ల అధిక రక్తపోటు వంటి సమస్యలు వస్తాయని వైద్యులు కూడా హెచ్చరిస్తున్నారు. అయితే మన శరీరానికి కావలసిన పోషకాలు ఉప్పులో కూడా ఉంటాయి. శరీరంలో సోడియం స్థాయి తగ్గితే చాలా సమస్యలు ఎదురవుతాయి.అయితే రిఫైన్డ్? సాల్ట్? మన ఆరోగ్యానికి హానికరం. రిఫైన్డ్? ఉప్పు కాకుండా హిమాలయన్? సాల్ట్?, రాక్? సాల్ట్?, పింక్? సాల్ట్?, అన్?రిఫైన్డ్? సాల్ట్? వాడటం మంచిది. ఉప్పులోని అయొడిన్? థైరాయిడ్? పనితీరును మెరుగుపరుస్తుంది. అయితే రోజూ పరగడపునే ఉప్పు కలిపిన నీళ్లు తాగడం మన ఆరోగ్యానికి ఎలాంటి ఫలితాలను ఇస్తుందో ఇప్పుడు తెలుసుకుందాం..

ఎలా పనిచేస్తుంది..

రోజూ పరగడపున ఒక గ్లాసు ఉప్పు కలిపిన గోరువెచ్చని నీళ్లు తాగడం వల్ల ఆరోగ్యానికి చాలా ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు నిపుణులు. ఇది శరీరానికి ఒక పవర్? బూస్టర్?లా పనిచేస్తుందంటున్నారు. ప్రాచీన కాలం నుంచీ ఉన్న ఈ చిట్కాని పాటించడం ఆరోగ్యానికి మంచిదని సూచిస్తున్నారు. ఉప్పు నీరులో సోడియం, పొటాషియం, క్లోరైడ్ వంటి ఎలక్ట్రోలైట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో నీటి సమతుల్యతను కాపాడతాయి.నరాలు, కండరాల పనితీరును మెరుగుపరుస్తాయి. ఉదయాన్నే ఉప్పు నీళ్లు తాగితే డీహైడ్రేషన్ సమస్యలు దూరమవుతాయి. జిమ్‌కి వెళ్ళేముందు తాగితే, వర్కౌట్ ఎనర్జీ డబుల్ అవుతుంది! పరిశోధనల ప్రకారం, ఈ ఎలక్ట్రోలైట్లు మన శరీరంలోని కణాలను రీచార్జ్ చేస్తాయి, ఫలితంగా మొత్తం రోజు ఫ్రెష్‌గా ఉంటాం. ఇది కేవలం ఒక డ్రింక్ కాదు.. శరీరానికి ఒక ఎనర్జీ బూస్టర్?లా పనిచేస్తుంది!ఉప్పు నీళ్లు తాగడం వల్ల జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. ఇది కడుపులో హైడ్రోక్లోరిక్ యాసిడ్ (%ఎజశ్రీ%) ఉత్పత్తిని పెంచుతుంది, జీర్ణ ఎంజైమ్‌లను స్టిమ్యులేట్ చేస్తుంది. ఫలితంగా ఆహారం సులభంగా జీర్ణమవుతుంది, పోషకాలు మెరుగ్గా శోషించబడతాయి. గ్యాస్ట్రిక్, మలబద్ధకం, బ్లోటింగ్ వంటి సమస్యలు దూరమవుతాయి. ఉప్పు నీరు శరీరంలోని మైక్రోస్కోపిక్ టాక్సిన్‌లను, ఫెకల్ మ్యాటర్‌ను ఫ్లష్ అవుట్ చేస్తుంది, ఇది నేచురల్ డిటాక్స్ మెథడ్?లా పనిచేస్తుంది!

చర్మ సమస్యలు ఎక్జిమా, స్కిన్ పసోరియాసిస్ వంటివి తగ్గుతాయి, మినరల్స్ చర్మాన్ని హైడ్రేట్ చేస్తాయి. గొంతు నొప్పి, దగ్గు, జలుబు, అలర్జీ వంటి శ్వాసకోశ సమస్యలకు ఇది మంచి ఔషధంలా పనిచేస్తుంది. గొంతు నొప్పి ఉన్నప్పుడు ఉప్పునీటితో పుక్కిలిస్తే తక్షణ ఉపశమనం లభిస్తుంది. ఇది రోగనిరోధక శక్తిని కూడా బూస్ట్ చేస్తుంది, ఫలితంగా రోజువారీ ఇన్ఫెక్షన్‌లు తగ్గుతాయి.

ఎలా చేయాలి.. 1 గ్లాసు గోరు వెచ్చని నీటిలో 1/4 టీస్పూన్ ఉప్పు కలిపి తాగాలి. హిమాలయన్ పింక్ సాల్ట్ లేదా అన్-రిఫైన్డ్ సాల్ట్ ఉపయోగిస్తే మంచి ఫలితం ఉంటుంది. ఉదయం పరగడపునే తాగాలి. అయితే అధిక రక్తపోటు, గుండె సమస్యలు ఉన్న వాళ్లు ఉప్పు నీటి జోలికి పోకపోవడమే మంచిది. అధిక మోతాదులో తాగితే దుష్ప్రభావాలు కలుగుతాయి. కావున మితంగా తాగితేనే మంచి ఫలితాన్ని పొందవచ్చు. ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం పోషకాహారం, వ్యాయామం తప్పనిసరిగా అలవాటుగా మార్చుకుంటే ఎలాంటి అనారోగ్యం దరిచేరదు.



## మార్నింగ్ లేవగానే చేతులు, కాళ్లల్లో తిమ్మిర్లు వస్తున్నాయా?

శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి రకరకాల ప్రయత్నాలు చేయాల్సి ఉంటుంది. ఆరోగ్యంగా తినడం, సమయానికి వ్యాయామం చేయడం వంటివి. కానీ కొన్నిసార్లు అలాంటి కొన్ని లక్షణాలు శరీరంలో కనిపించడం ప్రారంభిస్తాయి. అసలు కారణం అర్థం చేసుకోవడం కష్టంగా అనిపిస్తుంది. ఈ సమస్యలలో ఒకటి చేతులు, కాళ్ళలో జలదరింపు. తరచుగా ఈ సమస్య నిరంతరం కూర్చోవడం లేదా నిలబడి ఉండటం, శరీరంలోని ఏదైనా భాగంపై ఎక్కువసేపు బరువు పెట్టడం వల్ల సంభవిస్తుంది. కానీ మీరు దీన్ని చేయకపోతే, ఇప్పటికీ ఈ సమస్య సంభవిస్తుంది. అప్పుడు మీరు దానికి కారణాన్ని తెలుసుకోవాలి.చేతులు, కాళ్ళలో జలదరింపుకు కారణమేమిటి?చేతులు, కాళ్ళలో జలదరింపునకు అనేక కారణాలు ఉండవచ్చు. విటమిన్ లోపం వల్ల కూడా ఈ సమస్య రావచ్చు. నరాలు ఆరోగ్యంగా ఉండాలంటే కొన్ని విటమిన్లు అవసరం. విటమిన్ %దీ%12, విటమిన్ %దీ%6, విటమిన్ %దీ%1, విటమిన్ %ఙ%, విటమిన్ %దీ%9 లేదా ఫోలేట్ వంటివి. విటమిన్ %దీ%12 కణాలకు శక్తిని ఉత్పత్తి చేయడానికి అవసరమైన మూలంగా పరిగణించబడుతుంది. శరీరంలో ఏదైనా విటమిన్ లోపం ఉంటే ఈ సమస్య రావచ్చు.మధుమేహం: మధుమేహం వల్ల కాళ్లు, కాళ్లలో, కొన్నిసార్లు చేతులు, చేతుల్లో జలదరింపు ఉంటుంది. రక్తంలో చక్కెర అధిక మొత్తంలో నరాల నష్టం కలిగిస్తుంది. ఈ సమస్య వల్ల శరీరంలోని నరాలకు సరఫరా చేసే రక్తనాళాలు కూడా దెబ్బతింటాయి. నరాలకు తగినంత ఆక్సిజన్ లభించనప్పుడు. అవి సరిగ్గా పనిచేయవు. చుట్టుపక్కల కణజాలాల నుండి సిరలపై ఎక్కువ ఒత్తిడి ఉన్నప్పుడు, సిరలు ఎండిపోవడం జరగవచ్చు. శరీరంలోని అనేక భాగాలలోని నరాలు కుదించబడి చేతులు లేదా పాదాలను ప్రభావితం చేస్తాయి. దీనివల్ల జలదరింపు, తిమ్మిరి లేదా నొప్పి వస్తుంది.

## ట్రావిస్ హెడ్ తుఫాన్ సెంచరీ..

ప్రతిష్ఠాత్మక యాషెస్ సిరీస్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. ఈ ఘన విజయం కారణంగా క్రికెట్ ఆస్ట్రేలియా దాదాపు రూ.17 కోట్లు నష్టపోయింది. అసలు మ్యాటర్ ఏంటో తెలిస్తే షాక్ అవ్వాల్సిందే. ఎందుకంటే, ఐదు రోజులపాటు జరగనున్న పెర్త్ టెస్ట్ మ్యాచ్ కేవలం 2 రోజుల్లోనే ముగిసింది. ఈ మ్యాచ్ లో మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ లో 172 పరుగులు చేయగా, ఆస్ట్రేలియా 132 పరుగులకు ఆలౌట్ అయింది.రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 164 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీని ప్రకారం, చివరి ఇన్నింగ్స్‌లో 205 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో, ఆస్ట్రేలియా తరఫున ట్రావిస్ హెడ్ 83 బంతుల్లో 123 పరుగులు చేశాడు. ఈ విధ్వంసక బ్యాటింగ్ సహాయంతో, ఆస్ట్రేలియా 28.2 ఓవర్లలో 205 పరుగులు చేసి, రెండవ రోజునే మ్యాచ్‌ను ముగించింది.

ఇంతలో, ఆస్ట్రేలియా జట్టు కేవలం 2 రోజుల్లోనే మ్యాచ్‌ను ముగించడంతో క్రికెట్ ఆస్ట్రేలియా 3 మిలియన్ ఆస్ట్రేలియన్ డాలర్ల నష్టాన్ని చవిచూసింది. %ూదీజ% స్పోర్ట్స్ నివేదిక ప్రకారం, మొదటి టెస్ట్ మ్యాచ్ 2 రోజుల్లో ముగిసినందున ఆస్ట్రేలియన్ క్రికెట్ బోర్డు ఆదాయం దెబ్బతింది.

ఎందుకంటే, ఆదివారం మ్యాచ్ చూడటానికి 60 వేల మంది టిక్కెట్లు బుక్ చేసుకున్నారు. కానీ ట్రావిస్ హెడ్ ఆగ్రహావేశాల కారణంగా, మొదటి టెస్ట్ మ్యాచ్ రెండవ రోజు ముగిసింది. దీని కారణంగా, మిగిలిన రోజుల టిక్కెట్ల అమ్మకాలు కూడా వృధా అయ్యాయి. ఈ టికెట్ల అమ్మకాల ద్వారా క్రికెట్ ఆస్ట్రేలియా దాదాపు 3 మిలియన్ డాలర్లు ఆర్జించవచ్చని అంచనా. కానీ ఆస్ట్రేలియా జట్టు 2వ రోజు మ్యాచ్‌ను ముగించినందున, దాదాపు 17.35 కోట్లు నష్టపోయినట్లు సమాచారం.



## గౌహతిలో టీమిండియాకు ఘోర అవమానం.

గౌహతిలో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్ట్‌లో టమిండియా వెనుకబడి ఉంది. మూడో రోజు భారత్ 201 పరుగులకే ఆలౌట్ అయింది. మూడో రోజు ఆట ముగిసే సమానికి రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ కోల్పోకుండా 26 పరుగులు చేసిన సౌతాఫ్రికా.. మొత్తంగా 314 పరుగుల ఆధిక్యంలో ఉంది. కోల్‌కతాలో అవమానకరమైన ఓటమి తర్వాత భారత్ బలమైన పునరాగమనం చేస్తుందని భావించారు. కానీ, గౌహతిలో పరిస్థితి మరింత దిగజారి, టీమ్ ఇండియాను సొంత గడ్డపై దారుణమైన మరకగా మిగిల్చింది.ఒకప్పుడు భారత్‌ను స్వదేశంలో ఓడించడం కష్టమే కాదు, అసాధ్యం కూడా అని భావించేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి ఎలా ఉందంటే, గత ఏడాది కాలంలో భారత జట్టు స్వదేశంలో జరిగిన ఆరు మ్యాచ్‌ల్లో నాలుగు ఓడిపోయింది. ఇంతలో, దక్షిణాఫ్రికాతో జరుగుతోన్న గౌహతి టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో, గత 59 ఏళ్లలో ఎప్పుడూ జరగనిది చోటు చేసుకుంది.

టీమిండియాపై మాయని మచ్చ..

గౌహతి టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో టీమ్ ఇండియా మంచి ఆరంభాన్ని ఇచ్చింది. కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్ 65 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యాన్ని పంచుకున్నారు. రాహుల్ 22 పరుగుల వద్ద అవుట్ అయ్యాడు. ఆ తర్వాత, జట్టు స్కోరు 95 పరుగుల వద్ద ఉన్నప్పుడు, యశస్వి కూడా 58 పరుగుల వద్ద పెవిలియన్‌కు చేరాడు. అతని అవుట్‌తో, టీమిండియా ఇన్నింగ్స్ ముక్కల్లా కుప్పకూలింది.27 పరుగులకే 6 వికెట్లు..

రెండో వికెట్ 95 పరుగుల వద్ద పడిపోయింది. ఆ తర్వాత ఏడుగురు బ్యాట్స్‌మెన్ కేవలం 27 పరుగులకే ఔటయ్యారు. 59 ఏళ్లలో టీమ్ ఇండియా స్వదేశంలో ఇంత తక్కువ పరుగులకే ఆరు వికెట్లు కోల్పోవడం ఇదే తొలిసారి. చివరిసారిగా 1966లో కోల్‌కతాలో వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్‌లో భారత్ 41 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయింది.

గౌహతి టెస్ట్ మూడో రోజు, టీం ఇండియా బ్యాట్స్‌మెన్ ఎదురుదెబ్బ తగులుతుందని భావించారు. కానీ అది జరగలేదు. భారత్ కేవలం 122 పరుగులకే 8 వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్ కొంత పోరాటం ప్రదర్శించి 72 పరుగుల భాగస్వామ్యాన్ని పంచుకున్నారు. సుందర్ 48 పరుగులకు అవుట్ అయ్యాడు. ఆ తర్వాత జట్టు 201 పరుగులకే ఆలౌట్ అయింది. యశస్వి జైస్వాల్ (58), కేఎల్ రాహుల్ (22), సాయి సుదర్శన్ (15), ధ్రువ్ జురెల్ (0), రిషబ్ పంత్ (07) ఔటయ్యారు. దక్షిణాఫ్రికా తరఫున మార్కో జాన్సెన్ అద్భుతంగా రాణించి 6 వికెట్లు పడగొట్టాడు.




Printed published and owned by Godishala Somaiah published from # 15-76,Medipally, Ghatkesar,Ranga reddy,Dist,Printed at Sri SehaSai Printers,IDA BalaNagar, Hyderabad,Editor : Godishala Somaiah,email:nhnews24@gmail.com,ph 9912580066,RNI APTEL/2012/45237..